



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 239 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 21 మే 2026 పేజీలు : 12 వెల : 2/-


## 'చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయ్'..

### రోడ్డు పక్కన ఆగి తాటి ముంజలు తిని..

- నేడు కుప్పం పర్యటనకు వెళ్లిన చంద్రబాబు, భువనేశ్వరి
- తాటి ముంజలు అమ్ముతున్న వ్యక్తుల వద్ద ఆగిన చంద్రబాబు దంపతుల వాహనం
- సాక్షాత్తు సీఎం తన వద్దకు రావడంతో ఆనందంలో మునిగిపోయిన తాటి ముంజలు అమ్ముతున్న వ్యక్తులు
- కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన తాటి ముంజలు అంటూ సీఎం ట్వీట్





**కుప్పం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు.. మార్గంమధ్యలో రోడ్డుపక్కన ఆగి తాటిముం జలు తిన్నారు. కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరకు వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించిన తర్వాత తిరుగు ప్రయాణంలో తంజమ్మకొట్టాలు వద్ద కల్లు గీత కార్మికులు తాటి ముంజలు తీస్తుండటాన్ని గమనించి ఆగారు. దీనికి సంబంధించిన ఫొటోలను చంద్రబాబు, భువనేశ్వరి సోషల్ మీడియాలో షేర్ చేశారు. "కల్తీ లేదు.. కార్బైడ్ లేదు. పురుగు మందుల గోల లేదు. మా కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటి ముంజలు రోడ్డు పక్క ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది. మన గ్రామీణ ఆహార ఉత్పత్తులకు మించింది ఏముంటుంది!"అని చంద్రబాబు పేర్కొన్నారు. "తాజా తాటి ముంజలను రుచి చూశాం. చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయ్. కల్లుగీత కార్మికులతో కాసేపు మాట్లాడి వారి వృత్తి సమస్యలు, కుటుంబ పరిస్థితులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు" అని భువనేశ్వరి తెలిపారు.

# శ్రీశ్రీ రవిశంకర్ గొప్ప మానవతావాది

- ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఏపీలో పనిచేయాలి : సీఎం చంద్రబాబునాయుడు
- ఫౌండేషన్ 45వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- హింసలేని సమాజం, ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని బోధిస్తున్నారన్న సీఎం
- గ్రామాల నుంచి కొలంబియా వరకు అనిశ్చితి నెలకొంటే చర్చల ద్వారా మార్పులు తెచ్చినట్లు వెల్లడి



**విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ ఆధ్యాత్మిక నాయకుడే కాదు.. గొప్ప మానవతావాది అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పని చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవంతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. కేవలం ఓ ముఖ్యమంత్రిగానే ఇక్కడికి రాలేదని, ఓ భారతీయుడిగా, గురూజీ బోధనల్ని అనుసరిస్తున్న వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు. ఆయన కేవలం ఓ ఆధ్యాత్మికతను బోధించే ఓ గురువు మాత్రమే కాదని, శాంతిసామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని కొనియాడారు. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి ఆధునిక ప్రపంచానికి వారధిగా శ్రీరవిశంకర్ గురూజీ వ్యవహరిస్తున్నారుని అన్నారు. హింసలేని సమాజం-ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని సాధించాలని దశాబ్దాలుగా బోధిస్తూ మానవాళికి గొప్పసేవ చేస్తున్నారని కితాబిచ్చారు. యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని, అనిశ్చితి నుంచి బయటపడేసేలా మానవత్వం అనే అత్యుత్తమ మార్గాన్ని ఆయన ఎంచుకున్నారని కొనియాడారు. యుద్ధక్షేత్రాల నుంచి ట్రాన్స్ ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ అనే విధానాలను అనుసరించారని పేర్కొన్నారు. గ్రామాల నుంచి అంతర్జాతీయ స్థాయి సంస్థల వరకూ, అనిశ్చితి నెలకొన్న కొలంబియా ప్రాంతాల వరకూ చర్చలు అనే శాంతి మార్గం ద్వారా మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. సామాన్య ప్రజలతో పాటు అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆధ్యాత్మికవేత్త శ్రీ రవిశంకర్ గురూజీ అన్నారు. 45 ఏళ్లక్రితం హ్యాపీ హ్యూమన్ బీయింగ్,

మిగతా .. 2లో..

59 ఏళ్ల తర్వాత.. తమిళనాడు

## మంత్రివర్గంలో కాంగ్రెస్



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామ్యం కానుంది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పీ.విశ్వనాథన్‌లు గురువారం మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. 59 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తమిళనాడు మంత్రివర్గంలో కాంగ్రెస్ చేరడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. తమిళనాడులో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో

మిగతా .. 2లో..

దేశానికే ఆదర్శంగా

## ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

- నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ పై అధికారులు దృష్టిసారించాలి - ప్రభుత్వ పాఠశాల పిల్లలను సొంత బిడ్డల్లా భావించి పనిచేయాలి
- ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్
- డీఈవోలు, ఏపీసీలతో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమావేశం




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** "దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్నది నా ధ్యేయం. అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నాను. అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులపై అధ్యయనానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. అక్కడ వారు తెలుసుకున్న మంచి బోధనా పద్ధతులను రాష్ట్రంలో అమలు చేస్తాం" అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలు, ఏపీసీలతో (అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్) మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, క్వాలిటీ మెరుగుపర్చకపోతే నష్టపోయేది పిల్లలే అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ఓపెన్ మార్కెట్‌తో పోటీపడాలన్నారు. ఇందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరల్డ్ క్లాస్ బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ తన లక్ష్యమని, ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

**బిడ్డల భవిష్యత్తు కేంద్రంగా నిర్ణయాలు**

"ఈ సమావేశం కేవలం సమీక్ష కోసం కాదు. యాక్షన్ ప్లాన్ కోసం ఏర్పాటు చేశాం. నేను విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్రంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఏ పాఠశాలలో ఎంతమంది చదువుతున్నారో రాష్ట్రస్థాయి విజిబిలిటీ, కనీస

మిగతా .. 2లో..

ఈ నెల 27, 28 తేదీల్లో

## 'హైబ్రిడ్' పద్ధతిలో టీడీపీ మహానాడు

- ఇప్పటివరకు 37 మహానాడులు విజయవంతంగా జరిగాయి
- మోదీ పిలుపు మేరకు వర్చువల్, ఫిజికల్ పద్ధతిలో మహానాడు
- ఏపీకి చెందిన 13, తెలంగాణకు చెందిన 4 తీర్మానాలు
- టీడీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు' ఈనెల 27, 28 తేదీల్లో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా 'హైబ్రిడ్' (వర్చువల్ & ఫిజికల్) పద్ధతిలో జరగబోతోందని టీడీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రకటించారు. పార్టీ స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు 37 మహానాడులు విజయవంతంగా జరిగాయని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ మొదట ఈ మహానాడును నెల్లూరులో భారీ ఎత్తున నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశామని, నెల్లూరులో జరిగి ఉంటే దాదాపు 7 వేల బస్సులు, వేలాది కార్లు, ట్రక్కులు వచ్చేవని అన్నారు. అయితే, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపును గౌరవిస్తూ, దేశంలో ఇంధన (పెట్రోల్, డీజిల్) కొరతను దృష్టిలో ఉంచుకుని, ఈ నిర్ణయాన్ని ఏపీలోనూ అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావించారని అన్నారు. అందుకే నెల్లూరు కాకుండా మంగళగిరి కేంద్ర కార్యాలయంలో 'హైబ్రిడ్ మహానాడు' నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్చువల్ హైబ్రిడ్

మిగతా .. 2లో..

తెలుగు రాష్ట్రాల్లో

## భానుడి ప్రతాపం

పిడుగురాళ్లలో 47.6, నిర్మల్‌లో 46.5 డిగ్రీలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. తెలంగాణలో 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా, ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా ఏపీలోని పిడుగురాళ్లలో 47.6, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఏపీలోని కంకిపాడు (కృష్ణా), నందన మారెళ్ల (మార్కాపురం)లో 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణలోని హనుమకొండలో 46.4, జగిత్యాలలో 46.3,

మిగతా .. 2లో..

అంతర్జాతీయ సంస్థలను

## ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలి



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనికోసం అంతర్జాతీయ స్థాయి

మిగతా .. 2లో..

విచారణకు సహకరించాలనే

## నా కుమారుడిని అప్పగించా..



కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** భాజపాలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను చివరి కోరిక ఏంటని అడిగితే.. చనిపోయిన తర్వాత భాజపా జెండా కప్పాలని

మిగతా .. 2లో..

ఇజ్రాయెల్ ప్రధాని పదవికి

## పోటీ చేస్తా..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్‌లో తనకు 99 శాతం ప్రజాదరణ ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన అధ్యక్ష పదవీ కాలం ముగిసిన అనంతరం అక్కడ ప్రధాని పదవికి కూడా పోటీ చేయొచ్చని చమత్కరించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. యుద్ధంపై ఇరాన్‌తో ఒప్పందానికి వచ్చే విషయంలో ఎలాంటి తొందర లేదన్నారు. ఇరాన్‌పై దాడుల గురించి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఏం చెప్పారని

మిగతా .. 2లో..

పాస్టర్ అభినయ్‌పై దాడి కల్పితం..

## 8 మందిపై కేసులు : ఎస్పీ



**పాడేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పాస్టర్ అభినయ్ దర్శన్‌పై దాడి పూర్తి కల్పితమని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. కల్పిత దాడి ఘటనలో 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఏ1 పాస్టర్ అభినయ్, ఏ2 బిల్లా కిరణ్, ఏ3 కె.బెన్హర్, ఏ4 భాను ప్రసాద్, దాడికి సహకరించిన వసంతకుమార్, ప్రేమ్‌కుమార్, సత్యరాజు, ఇంద్రకుమార్‌పై కేసులు

మిగతా .. 2లో..

## టెట్రా ప్యాక్‌లో వోడ్కా..

కేంద్రానికి సుప్రీం నోటీసులు



**విశ్వం వాయిస్ న్యూస్ :** టెట్రా ప్యాకెట్లు, సాచెట్లలో వోడ్కా విక్రయాలపై కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎవరూ గుర్తించలేని విధంగా అలాంటి ప్యాకేజీల్లో మద్యం అమ్మకంపై నిషేధం విధించాలని అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. అలాంటి ప్యాకేజీలు వినియోగదారులను తప్పుదారి పట్టించి, మైనర్లను

మిగతా .. 2లో..

'ప్రత్యేక వ్యూహాత్మక' స్థాయికి..

## భారత్, ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్, ఇటలీలు తమ సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించాయి. అదేవిధంగా వాణిజ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతికతల రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు సిద్ధమయ్యాయి. ఇటలీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ..

మిగతా .. 2లో..

## (మొదటిపేజీ తరువాయి)

# శ్రీశ్రీ రవిశంకర్ గొప్ప మానవతావాది

స్ట్రెస్ ఫ్రీ సొసైటీ బెటర్ వరల్డ్ అనే విజన్‌తో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. సురక్షిత తాగునీరు, రివర్ రిజువనేషన్, మహిళా స్వయం సమృద్ధి, విలువలతో కూడిన విద్య లాంటి రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ను ఆయన అభినందించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రోజువారీ జీవితంలో చాలా ప్రభావాన్ని చూపిస్తున్నాయని వెల్లడించారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయని, సామాన్య ప్రజల జీవితాలు కూడా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోందని అన్నారు. గ్యాస్, ఇంధనం లాంటి వనరుల మార్కెట్ లభ్యత ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని తెలిపారు. ఈ సమయంలో ఒత్తిడిని ఎదుర్కోని సమర్ధంగా జీవించాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలోనే ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ లాంటి సమర్ధవంతమైన నేత దేశానికి నేతృత్వం వహిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రగామిగా మారుతుందని జోస్యం చెప్పారు. వేల ఏళ్ల క్రితం వరకూ మానవాళిని నడిపించిన నేల ఇది. ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన దేశం మనదని పేర్కొన్నారు. ఆధునిక జీవనంలో శాంతిని సాధించేలా శ్రీ రవిశంకర్ గురూజీ తన బోధనలతో ప్రభావితం చేశారని, సంస్కృతితో మిళితమైన ఆధునికత, విలువలతో కూడిన జీవనం లాంటి ఎన్నో అంశాల ద్వారా తన బోధనల్ని సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మేం కూడా ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా తరగతులు నిర్వహించామని గుర్తు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన నేల నుంచి తాను వచ్చానని, ప్రపంచంలో ఉండే హిందువులంతా ఒక్కసారైన తిరుపతి శ్రీవారిని దర్శించుకోవాలని అనుకుంటారని అన్నారు. శ్రీశైలం, ఆహోబిలం, అన్నవరం, సింహాచలం లాంటి అధ్యాత్మిక క్షేత్రాలు నిండిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో నిర్మిస్తున్నామని, పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం ఆర్ధిక ప్రగతి, టెక్నాలజీ మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మార్చటమేననేది తన భావన అన్నారు. ప్రతీ పౌరుడూ శాంతి సౌఖ్యాలు, ఆనందంగా జీవించాలన్నదే తన అభిప్రాయమని పేర్కొన్నారు. ఏపీ సమీకృత అభివృద్ధి సాధించాలన్నదే తన లక్ష్యం కూడా అన్నారు. ఏపీలోని ప్రతీ పౌరుడికీ అత్యుత్తమ జీవన ప్రమాణాలు కల్పించేలా సంకల్పం తీసుకున్నామని చంద్రబాబునాయుడు అన్నారు. అందుకే పీ4 లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అందుకే స్వర్ణాంధ్ర 2047 విజన్ కూడా అమలు చేశామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతికత సాయంతో ఏపీని గ్లోబల్ ఎకానమీలో ఓ కీలకమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. అదే సమయంలో ఎలాంటి ఒత్తిడిలేని సమాజాన్ని కూడా తీసుకురావాలని పేర్కొన్నారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అవసరమని పేర్కొన్నారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు ఏపీలో పనిచేయాలని కోరారు.

**గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆశీస్సులు పొందిన ఎంపీ సానా సతీష్ బాబు**

బెంగళూరులో నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆశీస్సులను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పొందారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం గురుదేవ్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ, గురుదేవ్ ఆశీస్సులు పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మికత మనిషిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజసేవలో మరింత బాధ్యతతో పనిచేయడానికి ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.

**59 ఏళ్ల తర్వాత.. తమిళనాడు**

# మంత్రివర్గంలో కాంగ్రెస్

డీఎంకే నేతృత్వంలోని కూటమి నుంచి పోటీ చేసిన కాంగ్రెస్.. ఐదు స్థానాల్లో విజయం సాధించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ టీవీకేకు లభించకపోవడంతో.. తాము మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. డీఎంకే నుంచి బయటకు వచ్చి టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చింది. ఈ క్రమంలో విజయ్ మంత్రివర్గంలో తాజాగా రెండు బెర్తులను ఖరారు చేసుకుంది.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి ప్రతాపం

ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగనుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# ఇజ్రాయెల్ ప్రధాని పదవికి పోటీ చేస్తా..

ట్రంప్‌ను విలేకరులు ప్రశ్నించగా.. ఆయన చాలా మంచి వ్యక్తి అని, తాను కోరుకున్నది ఏదైనా చేస్తారని తెలిపారు. ఇజ్రాయెల్‌లో నెతన్యాహును సరిగా ట్రీట్ చేయడం లేదని వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదరకుంటే త్వరలోనే ఇరాన్‌పై విరుచుకుపడతామని ట్రంప్ ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే. మరోవైపు.. ఇరాన్ సాయుధ దళాలు కాల్పుల విరమణ సమయాన్ని తమ శక్తిసామర్థ్యాలను పునరుద్ధరించుకునేందుకు వినియోగించుకున్నాయని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఇరాన్ ప్రజలు సైన్యంపై భరోసా కలిగి ఉండాలన్నారు. మరో యుద్ధానికి తెరలేపేలా శత్రువు (అమెరికా) కదలికలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అదే జరిగితే దాడి చేసినవారు పశ్చాత్తాపపడేలా చేస్తామన్నారు.

# ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

డేటా అందుబాటులో లేదు. పంచాయితీరాజ్ మంత్రిగా పనిచేసినప్పుడే నేను కేవలం మూడునెలల్లో పూర్తిస్థాయి సమాచారంతో డ్యాష్ బోర్డు తయారుచేశాం. విద్యాశాఖలో కనీస డేటా బేస్ అందుబాటులో లేని పరిస్థితి నుంచి విద్యాశాఖలో నా ప్రయాణం ప్రారంభించాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మన సొంత బిడ్డల్లా భావించి నిర్ణయాలు తీసుకోవాలి. మనం తీసుకునే నిర్ణయాలపై వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. బిడ్డల భవిష్యత్ కేంద్రంగా నిర్ణయాలు ఉండాలి. డ్యాష్ బోర్డు ప్రకారం యాక్షన్ ప్లాన్ దిశగా డీఈవోలు, ఏపీసీలు పనిచేయాలి. రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది పిల్లలు డ్రాపవుట్స్ గా ఉన్నారు. నెవర్ ఎన్ రోల్డ్ పై కూడా ఫోకస్ చేయాలి. నూరుశాతం ఎన్ రోల్ మెంట్ పై అధికారులంతా దృష్టిపెట్టాలి. యువగళం పాదయాత్ర సమయంలో నేను కర్నూలు జిల్లాలో పర్యటించేటప్పుడు వలస కార్మికుల కష్టాలను కళ్లారా చూశాను. ఎట్టిపరిస్థితుల్లో పిల్లలు పొలం పనులకు వెళ్లే పరిస్థితి ఉండకూడదు. ఈ విషయంలో ప్రాపర్ ట్రాక్ మెకానిజం ఉండాలి" అన్నారు.

**ఉద్యమంలా జీఎఫ్ఎల్ఎన్ చేపట్టాలి**

"లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్ ను ఒక ఉద్యమంగా అమలుచేయాలి. వాస్తవాలు తెలుసుకున్నపుడే సరైన నిర్ణయాలు తీసుకోగలం. నిజం చేదుగా, అబద్ధంగా తీయగా ఉంటుంది. వాస్తవాన్ని అంగీకరిస్తేనే మన ప్రయాణం సరైన దిశగా సాగుతుంది. మేం సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే మీరు సరైన సమాచారం ఇవ్వాలి. ప్రస్తుతం 9వ తరగతికి క్లిక్కర్ టెక్నాలజీ అమలు చేస్తున్నాం. క్రోమ్ బుక్స్ అందించబోతున్నాం. నూరుశాతం జీఎఫ్ఎల్ఎన్ సాధనే లక్ష్యంగా పనిచేయాలి. 5 శాతం వెనుకబడటం అంటే సాధారణమైంది కాదు. వాస్తవంలో అది లక్షల సంఖ్యలో ఉంటుంది. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 10శాతం ఎన్ రోల్ మెంట్ ఇంప్రూవ్ చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందుకోసం సమిష్టిగా పనిచేయాలి" అన్నారు.

**ఆత్మవిశ్వాసం నింపిన విద్యాశాఖ ప్రకటన**

ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్, ప్రతిభావంతమైన టీచర్లు ఉన్నారని, పదోతరగతి ఫలితాలపై ఇటీవల తొలిసారి ప్రభుత్వమే యాడ్ ఇచ్చిందని తెలిపారు. అది పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపిందని అన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాల సాధనకు వందరోజుల ప్రణాళిక బాగా ఉపకరించిందని అన్నారు. అది అవసరం లేకుండానే ట్రాన్సిషన్ జరిగాలని, ఫౌండేషన్ పకడ్బందీగా ఉండాలని, దానిపై అధికారులంతా శ్రద్ధ వహించాలని సూచించారు.

**రెండేళ్లలో రాష్ట్రమంతటా స్మార్ట్ కిచెన్లు**

"రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ స్కూళ్ల మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్ ప్రవేశపెట్టాం. దీనిపై అధికారులు ఫోకస్ చేయాల్సిన అవసరం ఉంది. క్రిటికల్ ఇన్ ఫ్రా కోసం ప్రభుత్వం నుంచి నిధులిస్తున్నాం. ఇందుకోసం అవసరమైతే దాతల సహకారం తీసుకోండి. ప్రతి పాఠశాలకు లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింటింగ్స్, డ్రింకింగ్ వాటర్, టాయ్ లెట్, బెంచిలు కచ్చితంగా ఉండాలి. బేసిక్ ఇన్ ఫ్రా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలన్నదే మా ధ్యేయం. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కడపలో స్మార్ట్ కిచెన్ అద్భుతంగా చేశారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రం మొత్తం స్మార్ట్ కిచెన్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం" అని అన్నారు.

**ఇంటర్నేషనల్ స్కూలుగా నిడమర్రు పాఠశాల**

మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు స్కూలును ఇంటర్నేషనల్ స్కూలుగా తీర్చిదిద్దుతున్నామని లోకేశ్ తెలిపారు. అక్కడ తొలిసారి నో అడ్మిషన్ బోర్డు పెట్టారని అన్నారు. నెల్లూరులో కూడా రెండు స్కూల్స్ ను మంత్రి నారాయణ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక పాఠశాలను మోడల్ స్కూలుగా తీర్చిదిద్దాలని అధికారులను కోరుతున్నానని అన్నారు. అమెరికాలో స్కూల్ డిస్ట్రిక్ట్ అనే కాన్సెప్ట్ అమలులో ఉందని అన్నారు. నిడమర్రులో మనం కల్పించిన అత్యుత్తమ సౌకర్యాల వల్ల పక్క నియోజకవర్గాల వారు కూడా ఈ నియోజకవర్గానికి తమ బిడ్డల అడ్మిషన్ కోసం నివాసం మార్చుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇదే పరిస్థితి కల్పించే లక్ష్యంతో పనిచేయాలని అన్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు.

**బోధనపైనే ఉపాధ్యాయులు దృష్టిపెట్టాలి**

"నేను విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక అనేక సంస్కరణలు తెచ్చా. ఉపాధ్యాయులు బోధనపైనే దృష్టిపెట్టాలి. అధికారులు అడ్మినిస్ట్రేషన్ పై శ్రద్ధ వహించాలి. లీప్ యాప్ ద్వారా పనివిధానాన్ని మెరుగుపర్చుకోవాలి. గతంలో విజిబిలిటీ లేకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు మొత్తం విధానానికి లీప్ యాప్ కేంద్రంగా ఉంటుంది. రాష్ట్ర, జిల్లా, మండల, స్కూలు స్థాయిలో ఒకేవిధమైన డేటా ఉండాలి. లక్ష్యసారూప్యత ఉండాలి. డ్యాష్ బోర్డుపై శ్రద్ధపెట్టాలి. ఇదంతా పూర్తయ్యాక పబ్లిక్ డ్యాష్ బోర్డుకు యాక్సెస్ ఇస్తాం. పాల్, ఏఐ బేస్ లెర్నింగ్, ఏఐ ట్యూటర్ త్వరలోనే అమలు చేయబోతున్నాం" అని అన్నారు.

**నైతిక విలువలు ముఖ్యం**

టెక్నాలజీతోపాటు నైతిక విలువలు చాలా అవసరమని అన్నారు. అందుకే చాగంటి కోటేశ్వరరావు గారికి కేబినెట్ హోదాతో అడ్వయిజర్ గా పెట్టామని తెలిపారు. ప్రతి శనివారం వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్ పై దృష్టిపెట్టాలని అన్నారు. ఒక సోషల్ మీడియా పోస్టులో కొడుకు తల్లిని చంపే పరిస్థితి చూశానని, నైతిక విలువల బోధనతో ఇటువంటి ఘటనలను నివారించే అవకాశముందని అన్నారు. విద్యాశాఖపై పవిత్రమైన బాధ్యత ఉందని అన్నారు. జెండర్ సెన్సిటివిటీ కూడా చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయులకు ఎక్స్ పోజర్ విజిట్స్ ఏర్పాటు చేస్తున్నామని, యోగా, స్పోర్ట్స్ పై శ్రద్ధ పెడుతున్నామని వెల్లడించారు. స్పోర్ట్స్ కిట్స్ ఇస్తున్నామని, శాప్ ద్వారా స్పోర్ట్స్ కాంపిటీషన్స్ పెడుతున్నామని అన్నారు. విద్యాశాఖ వద్దని చాలామంది తనను వారించినా సమాజంలో తాను ఆశించిన మార్పు విద్యతోనే సాధ్యమని నమ్మి ఈ శాఖను తీసుకున్నానని అన్నారు. నూరుశాతం ఫలితాలు సాధించినపుడే విద్యాశాఖ మంత్రిగా సంతృప్తి చెందుతానని వ్యాఖ్యానించారు. అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ పై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించాల్సిన పవిత్ర బాధ్యత మనందరిపై ఉందని మంత్రి లోకేశ్ చెప్పారు.

**రెండేళ్లలో విద్యావ్యవస్థలో అనూహ్య మార్పులు**

హెచ్ఆర్‌డీ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ, పాఠశాల విద్య భవిష్యత్ కార్యాచరణ గురించి ఈ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. గత రెండేళ్లలో పాఠశాల విద్యావ్యవస్థలో మునుపెన్నడూ చూడని సంస్కరణలు చూసినట్లు చెప్పారు. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని అన్నారు. అనేకసార్లు మంత్రి లోకేశ్ రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షించి దశ, దిశ నిర్దేశించినట్లు చెప్పారు. ఒక్కోసారి ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సమావేశాలు నిర్వహించారని తెలిపారు. వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు నిరంతరం చర్చలు జరిపారని అన్నారు. రెండేళ్లలో విద్యాశాఖలో గుణాత్మకమైన మార్పులు తెచ్చిన మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కఠినమైనప్పటికీ వాస్తవాన్నే చెబుదామని, మంత్రి ఇచ్చిన ధైర్యంతోనే ఇప్పటివరకు ముందుకు సాగామని పేర్కొన్నారు. కొంతవరకు సఫలీకృతమయ్యామని, ఇప్పుడు మనం సంస్కరణల దశ నుంచి కన్సాలిడేషన్ వైపు వెళుతున్నామని తెలిపారు. ఈ స్థితిలో ఎదుగుతున్న మొక్కను మనం సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకునే వరకు నిర్విరామంగా కృషిచేయాలని అన్నారు. లక్ష్యాలపై క్లియర్ డెడ్ లైన్ పెట్టుకొని జవాబుదారీతనంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి తమీమ్ అన్సారియా, ఇతర రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

**ఈ నెల 27, 28 తేదీల్లో**

# 'హైబ్రిడ్' పద్ధతిలో టీడీపీ మహానాడు

విధానమే సరైనదని ఆయన అభిప్రాయపడ్డారు. నారా లోకేశ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత జరుగుతున్న మొదటి మహానాడు ఇదే కావడంతో అందరిలోనూ భారీ ఆసక్తి నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమం మొత్తం ఆయన నేతృత్వంలోనే అట్టహాసంగా జరగబోతోందని తెలిపారు. "మంగళగిరి కేంద్ర కార్యాలయంలో ఈనెల 27, 28 తేదీలలో జరిగే ఈ ప్రధాన వేడుకలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జాతీయ కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. కోవిడ్ సమయంలోనూ ఇదే విధంగా రెండు మహానాడులను విజయవంతంగా నిర్వహించాం. ఇప్పుడు కూడా అదే తరహాలో ఫీల్డ్ లెవెల్‌లో అన్ని క్లస్టర్లలో స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నాం. మండలానికి రెండు క్లస్టర్లు, పెద్ద మండలాల్లో మూడు క్లస్టర్ల చొప్పున విభజించాం. ప్రతి క్లస్టర్‌లో పార్టీ ప్రెసిడెంట్లు, క్లస్టర్ మరియు గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు కలిపి దాదాపు 300 మంది ఒకేచోట కూర్చుని మంగళగిరి లైవ్ కార్యక్రమాలను వీక్షిస్తారు. ఉదాహరణకు సర్వేపల్లి నియోజకవర్గంలో 12 క్లస్టర్లు ఉన్నాయి. అక్కడ దాదాపు 4 వేల మందికి రెండు రోజుల పాటు అక్కడే భోజన వసతులు కల్పిస్తూ, సాయంత్రం వరకు మహానాడును వీక్షించేలా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నాం. దీనివల్ల ఫీల్డ్ లెవెల్ కార్యకర్తలకు స్పష్టమైన సందేశం వెళ్తుంది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో అనేక సానుకూల మార్పులు వచ్చాయి. గత వైసీపీ హయాంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాచి, అరాచకాలు, దుర్మార్గాలు, దోపిడీలకు పాల్పడ్డారు. కూటమి పాలనలో వాటన్నింటికీ అడ్డుకట్ట పడింది. ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు, చట్టాలకు అనుగుణంగా నడుచుకుంటున్నారు" అని తెలిపారు. పెట్టుబడులు వరదలా వస్తున్నాయని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, లోకేశ్ నిరంతర ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారి అండ తోడవ్వడంతో రాష్ట్ర అభివృద్ధికి సరికొత్త బాటలు పడ్డాయని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండేళ్లలోనే లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. అనేక పరిశ్రమలు స్థాపించబడటంతో యువతకు మెండుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఇదొక కొత్త ట్రెండ్ కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఏ పార్టీ అయినా రాష్ట్ర బాగు గురించే ఆలోచించాలని సూచించారు. కానీ, వైసీపీ మాత్రం విధ్వంసానికి మారుపేరుగా నిలిచిందని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలకు "ఇక్కడ పెట్టుబడులు పెట్టొద్దు" అంటూ దొంగ మెసేజ్‌లు పంపి ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నాం కదా అని రాష్ట్రం నాశనమవ్వాలని కోరుకునే ఏకైక పార్టీ ఒక్క వైసీపీ మాత్రమేనని ధ్వజమెత్తారు. ఇలాంటి దుర్మార్గపు రాజకీయాలను తామెక్కడా చూడలేదని సోమిరెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై ఈ మహానాడులో మొత్తం 19 తీర్మానాలను ప్రవేశపెట్టబోతున్నట్లు చెప్పారు.

1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినవి: 13 తీర్మానాలు
2. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించినవి: 4 తీర్మానాలు
3. అండమాన్ అలయన్స్‌కు సంబంధించినవి: 1 తీర్మానం
4. రాజకీయ తీర్మానం : 1 తీర్మానం

ఈ తీర్మానాలపై తీర్మానాల కమిటీ సభ్యులు రెండు రోజుల పాటు క్షుణ్ణంగా చర్చించి ఫైనల్ చేశారు. పొలిట్ బ్యూరో సభ్యుల ఆమోదం అనంతరం, ఈనెల 27, 28 తేదీలలో వీటిని మహానాడు వేదికగా అధికారికంగా ప్రవేశపెట్టడం జరుగుతుందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

**అంతర్జాతీయ సంస్థలను**

# ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలి

నగరాలను అధ్యయనం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పరిశ్రమల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. "అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలి. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలి. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రధానిని కలిసి హెల్త్ క్లస్టర్ రాష్ట్రానికి కేటాయించాలని విజ్ఞప్తి చేద్దాం. జూన్‌లో ఫ్యూచర్ సిటీలోని ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలి. భూ కేటాయింపులు జరిగిన వెంటనే పరిశ్రమలు స్థాపించేలా నిబంధన విధించాలి. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలి. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేయాలి. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలి. కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలోని ప్రభుత్వ భూములు గుర్తించాలి. ద్వితీయ శ్రేణి నగరాల్లో జీసీసీ ఏర్పాటుపై దృష్టి పెట్టేలా పాలసీ రూపొందించాలి. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాలి" అని సీఎం దిశానిర్దేశం చేశారు.

**విచారణకు సహకరించాలనే**

# నా కుమారుడిని అప్పగించా..

కోరుకుంటారని చెప్పారు. తాను ఎలాంటి వాడినో కార్యకర్తలకు తెలుసన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో సంజయ్ మాట్లాడారు. బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా సంజయ్ స్పందిస్తూ.. "కేసీఆర్ పార్టీకి లోక్‌సభలో ఒక్క ఎంపీ లేరు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది.. ఆ కుటుంబ పాలనను అంతం చేసింది మేమే. అందుకే మాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. కేటీఆర్ ఫేక్ సోషల్ మీడియా ఫ్యాక్టరీ నడుపుతున్నారు. కన్నకొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా? విచారణకు సహకరించాలనే నా కుమారుడిని అప్పగించా." అని బండి సంజయ్ అన్నారు.

# 8 మందిపై కేసులు : ఎస్పీ

నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్న అభియోగంపై కేసులు పెట్టినట్లు చెప్పారు. అభినయ్‌పై గతంలో వరకట్నం, యువతిని వేధించిన కేసులు ఉన్నాయని తెలిపారు.

# టెట్రా ప్యాక్‌లో వోడ్కా..

మద్యపానం వైపు ప్రోత్సహించే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తంచేశారు. కమ్యూనిటీ అగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ అనే సంస్థ ఈ పిటిషన్ వేసింది. ఆ సంస్థ తరఫున లాయర్ విపిన్ నాయర్ వాదనలు వినిపించారు. "అలాంటి అనేక మద్యం ఉత్పత్తుల ప్యాకింగ్‌పై సరైన హెచ్చరికలు ఉండటం లేదు. అవి పండ్ల రసాలను పోలి ఉండేవిధంగా ప్యాక్ చేస్తున్న సందర్భాలున్నాయి. అలాంటి ప్యాకేజింగ్‌లో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఒకే విధమైన విధానాన్ని రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలి" అని కోరారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అభ్యర్థనను పరిశీలించింది. ఈ ప్యాకింగ్ తప్పుదోవ పట్టించే విధంగా ఉందంటూ కేంద్రం, రాష్ట్రాల్లోని ఎక్సైజ్ విభాగాలకు నోటీసులు జారీ చేసింది. నవంబర్ 2025లో కూడా టెట్రా ప్యాక్‌లలో పెరుగుతోన్న మద్యం అమ్మకాల గురించి సుప్రీం ఆందోళన వ్యక్తంచేసింది.

**'ప్రత్యేక వ్యూహాత్మక' స్థాయికి..**

# భారత్, ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు

ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీతో చర్చలు నిర్వహించారు. అనంతరం ఇరువురు నేతలు మీడియాతో మాట్లాడారు. మెలోనీ నాయకత్వంలో భారత్– ఇటలీ సంబంధాలకు కొత్త దిశ లభించిందని ప్రధాని మోదీ అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూ.1.93 లక్షల కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. షిప్పింగ్, పోర్టుల ఆధునికీకరణ, లాజిస్టిక్స్, బ్లూ ఎకానమీ రంగాల్లో ఇరుదేశాలు కలిసి పనిచేయనున్నాయని చెప్పారు. భారత్– ఇటలీ రక్షణ పారిశ్రామిక ప్రణాళిక.. సైనిక పరికరాల అభివృద్ధి, ఉత్పత్తికి మార్గం సుగమం చేసిందన్నారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా, ఇతర ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు సంబంధించి ఇరుదేశాలు నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నాయని తెలిపారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఈ సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే తమ వైఖరి అని స్పష్టం చేశారు. గౌరవం, పరస్పర విశ్వాసం ఆధారంగా ఇరు దేశాల మధ్య స్నేహం ఏర్పడిందని మెలోనీ అన్నారు. అనేక సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతున్నప్పటికీ.. పౌరుల్లో ప్రజాదరణను కలిగి ఉన్నారని ప్రధాని మోదీని ప్రశంసించారు. ఇండో– పసిఫిక్ ప్రాంతంలో నౌకాయాన స్వేచ్ఛ ఉండటం ముఖ్యమని చెప్పారు. అంతకుముందు ఇటలీ అధ్యక్షుడు సెర్గియో మటరెల్లాతో మోదీ భేటీ అయ్యారు. కృత్రిమ మేధ, అణుశక్తి, వాణిజ్యం, పెట్టుబడులు, సాంస్కృతిక సంబంధాలపై చర్చించారు.

# ఎడిటర్ వాయిస్

## ఏపీలో మూడో పార్టీ వస్తే మూడేది ఎవరికి?

రాజకీయాల్లో అవకాశాలు రావు, తీసుకోవాలి. ప్రజలు ఎపుడూ తెలివైన వాళ్ళు. వారికి తామే ఆల్టర్నేషన్ అని ఎవరైనా అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు, ప్రజలు తమదైన చైతన్యంతో తమకు కావాల్సిన ఆల్టర్నేషన్ ని తెచ్చుకుంటారు. గద్దె మీద కూర్చోబెడతారు. దానికి తాజా ఉదాహరణ తమిళనాడు. అక్కడ డీఎంకే ఓడితే అన్నా డీఎంకేనే దిక్కు అనుకున్నారు ఆ పార్టీ నేతలు. కానీ ఫలితాలు వచ్చిన తరువాత సీన్ అర్ధం అయింది మూడవ ప్లేస్ లోకి పడిపోయింది. అంటే జనాల ఆలోచనలు ఎంత వేగంగా మారుతాయన్నది అర్థం చేసుకోవాలిన అవసరం ఉంది. ఇదే కాదు దేశాన్ని మూడు నాలుగు దశాబ్దాలకు పైగా ఏకచత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ పార్టీ కూడా చివరికి విపక్షంలోకి రావాల్సి వచ్చింది.

**కూటమికి ప్రత్యర్థిగా :** ఏపీలో చూస్తే ప్రస్తుతానికి రాజకీయ వాతావరణం కూటమికి వైసీపీయే ప్రత్యర్థిగా ఉంది. అదే వైసీపీలో ధీమాను కూడా పెంచుతోంది. కూటమి తప్పులు చేస్తే అధికారం తమకే దక్కుతుందని మెచ్చి వరమాలను తమ మెడలో వేస్తారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. యాంటీ ఇంకెంబెన్సీ మీదనే ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో మేమే అని చెబుతున్నారు. మరో విషయం ఏమిటి అంటే ఒక పార్టీకి ఒకేసారి అధికారం ఇవ్వడం ఏపీ ప్రజలు చేస్తారు కాబట్టి ఆ ట్రాక్ రికార్డు చూసినా తమకే చాన్స్ అని కూడా వారు విశ్వాసంగా ఉన్నారు.

**థర్డ్ ఫోర్స్ వస్తే :** అయితే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయం ఉంది. రాజకీయంగా చూస్తే అది చాలా ఎక్కువ సమయమే. ఎందుకంటే క్షణాలలో అంతా మారే సీన్ పొలిటికల్ గా ఉంటుంది. అలా చూసినపుడు ఈ మూడేళ్ళలో కొత్త పార్టీ వచ్చినా లేక థర్డ్ ఫోర్స్ ఏదైనా ఎమర్జ్ అయినా ఎవరికి ఎక్కువ నష్టం అన్న చర్చ వస్తోంది. సాధారణంగా మూడవ పార్టీ వస్తే కనుక అది ఖాయంగా ప్రతిపక్ష పార్టీకే చేటు చేస్తుంది. దానికి మళ్ళీ అన్నా డీఎంకేని ఉదహరించాల్సి ఉంటుంది. అందువల్ల ఏపీలో కూడా వైసీపీకే దెబ్బ పడుతుందని అనే వారూ ఉన్నారు.

**టర్న్ కావడం లేదు :** ఏపీలో రెండేళ్ళ కూటమి ప్రభుత్వం పాలనలో అసంతృప్తి ఉంది. అయితే అది ఏ మేరకు అన్నది తెలియడం లేదు కానీ అధికారంలో ఉన్న పార్టీకి సహజం. కానీ ఆ అసంతృప్తి వైసీపీ వైపు మళ్ళడం లేదు. అంటే వైసీపీకి 2024 లో వచ్చిన 40 శాతం ఓట్లు అలా నికార్సుగా నిలిచి ఉన్నాయో లేవో తెలియడం లేదు కానీ కొత్త ఓట్లు అయితే జత చేరడం లేదు అన్న విశ్లేషణలు ఉన్నాయి. మరో వైపు చూస్తే ఏపీలో వైసీపీని వీడిన వారు ఉన్నారు, కూటమిలో చోటు లేని వారు ఉన్నారు. ఇంకా అన్ని పార్టీల తీరు చూసి కొత్తదనం కోసం ఆలోచిస్తున్న వారు ఉన్నారు. వీరందరి కోసం ఏదైనా పార్టీ వచ్చినా లేక ఫోర్స్ గా అందరూ కలిసి ప్రయత్నం చేసినా అపుడు ఏమిటి జరుగుతుంది అన్నది ఒక కీలకమైన చర్చ. అలాంటి సందర్భాలలో కచ్చితంగా వైసీపీకి ఇబ్బంది అవుతుందని అంటున్నారు.

**గొంతుకగా మారాలి :** వైసీపీ అయితే రెండేళ్ళ కాలంలో జనంలోకి పెద్దగా వచ్చింది లేదు. ఇక అసెంబ్లీ ముఖం ఎమ్మెల్యేలు చూసింది అంతకంటే లేదు. అధినేత జగన్ కూడా జనంలోకి వచ్చే ప్రయత్నం చేయడం లేదు. దాంతో తమ గొంతుకని విపక్షం వినిపించలేకపోతోంది అన్న భావన అయితే మెల్లగా జనంలోకి వెళ్తోంది. సరిగ్గా ఈ సమయంలో సర్దుకుని వైసీపీ దూకుడుగా ముందుకు సాగకపోతే మాత్రం మూడవ పార్టీ అయినా లేదా శక్తి అయినా వస్తే మాత్రం ఆ పార్టీ విజయావకాశాలనే దెబ్బ తీస్తాయన్న విశ్లేషణలు ఉన్నాయి. చూడాలి మరి ఏపీ రాజకీయాల్లో ఏ మార్పులు వస్తాయో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## సైబర్ నేరగాళ్లకు 'ఘోస్ట్' సిమ్ కార్డులు.. 66 మంది అరెస్ట్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సైబర్ నేరగాళ్లకు సిమ్‌కార్డులు అందిస్తున్న 66 మందిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'లో భాగంగా 13 రాష్ట్రాల్లో పోలీసులు దాడులు నిర్వహించారు. ఘోస్ట్ సిమ్‌కార్డులతో దేశవ్యాప్తంగా 76 సైబర్ నేరాలు చేసినట్లు గుర్తించారు. 18 బృందాలతో ఏడు రోజులపాటు ఈ ఆపరేషన్‌ను కొనసాగించారు. మొత్తం 1,194 ఘోస్ట్ సిమ్‌కార్డులు గుర్తించి.. వాటిలో 544 స్వాధీనం చేసుకున్నారు. సైబర్ నేరగాళ్లకు 20 మంది పీవోఎస్ ఏజెంట్లు సహకారం అందించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 10 మంది వొడాఫోన్ ఐడియా, ఏడుగురు ఎయిర్‌టెల్, ముగ్గురు జియో పీవోఎస్ ఏజెంట్లను అరెస్ట్ చేశారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, యూపీ, పశ్చిమబెంగాల్, దిల్లీ, హరియాణా, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్‌లో 'ఆపరేషన్ ఆక్టోపస్' కొనసాగింది. సిమ్ కోసం వచ్చిన వారికి తెలియకుండా మరో సిమ్ యాక్టివేట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.


## ఆలయ కోనేరులో పడి ముగ్గురు చిన్నారుల మృతి

**మేడిపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. మేడిపల్లి మండలం కొండాపూర్‌లోని శివగంగ ఆలయ కోనేరులో ప్రమాదవశాత్తు పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు బాలురు, ఒక బాలిక ఉన్నారు. మృతులను కొండాపూర్ గ్రామానికి చెందిన అడ్లగట్ట శేఖర్ కుమారుడు శరవింద్ శివ (7), శేఖర్ తోడల్లుడు రాజేంద్ర ప్రసాద్ కుమారుడు మన్విత్ సాయి (11), కుమార్తె మనస్విని (8)గా గుర్తించారు. కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన చిన్నారులు.. వారు మొక్కు తీర్చుకున్న సమయంలో కోనేరులో ఆడుతూ ప్రమాదవశాత్తు పడిపోయారు.

**నదిలో స్నానానికి వెళ్లి ఇద్దరు గల్లంతు**

మరోవైపు ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పరిధిలోని నాగావళి నదిలో స్నానానికి వెళ్లి ఇద్దరు బాలురు గల్లంతయ్యారు. పెద్దగనగల్లవానిపేట వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. శ్రీకాకుళం గుడివీధికి చెందిన ముగ్గురు పదోతరగతి విద్యార్థులు స్నానానికి వెళ్లారు. వీరిలో సాయితారక్ (15), లీలా కృష్ణ (15) గల్లంతు కాగా.. మణికంఠ క్షేమంగా బయటపడ్డాడు.

## హెచ్‌సీయూలో విద్యార్థి ఆత్మహత్య



**రాయదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపిన ప్రకారం... పశ్చిమబెంగాల్‌కు చెందిన మయాంక్(23) ఎంఏ ఎకనామిక్స్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. నెల రోజుల క్రితం అక్కడి రీడింగ్ రూంలోంచి ఓ విద్యార్థికి చెందిన ల్యాప్‌టాప్ మాయమైంది. విద్యార్థులు మయాంక్‌ను నిలదీయగా తానే తీశానని వెనక్కి ఇచ్చేశారు. అనంతరం మరో రెండు ల్యాప్‌టాప్‌లు మాయమయ్యాయి. వాటిని సైతం అతనే తీసి ఉంటాడని తోటి విద్యార్థులు ఆదివారం రాత్రి నిలదీశారు. తిరిగి ఇవ్వకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. రెండు ల్యాప్‌టాప్‌ల విషయం తనకు తెలియదని మయాంక్ స్పష్టంచేశారు. ఇదే విషయంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే సోమవారం నుంచి మయాంక్ కనిపించకుండా పోయారు. తనతో గదిలో ఉండే విద్యార్థి... ఈ విషయాన్ని మంగళవారం హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది వెళ్లి గదిలో వెతకగా.. మయాంక్ రాసిన సూసైడ్ నోట్ దొరికింది. ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని, ల్యాప్‌టాప్‌లు చోరీ చేయలేదని, చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. సెక్యూరిటీ సిబ్బంది చెరువు వద్దకు వెళ్లి చూడగా, మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కారులో లాక్కెళ్లి దివ్యాంగురాలిపై సామూహిక అత్యాచారం

**తమిళనాడులో అమానుష ఘటన**

**చెన్నై (ఆర్కేనగర్), విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో అమానుష ఘటన చోటుచేసుకుంది. దివ్యాంగురాలిపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. పుదుకోట్టై జిల్లా కరంబక్కుడి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 35 ఏళ్ల మహిళకు మాటలురావు. అవివాహితురాలైన ఆమె 10 కి.మీ. దూరంలో ఉన్న మరో గ్రామంలో రైస్‌మిల్లులో పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం పని ముగించుకుని అదే ప్రాంతంలోని బస్టాప్‌లో నిల్చుని ఉండగా.. కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు గ్రామంలో దింపుతామన్నారు. ఆమె నిరాకరించడంతో బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాత కారులో తీసుకెళ్లి కరంబక్కుడి-ఆలంకుడి రోడ్డులో తోసేసి వెళ్లిపోయారు. ఆమె అరుపులు విని వచ్చిన స్థానికులు కాపాడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. అత్యాచారానికి పాల్పడింది మనకొల్లైకి చెందిన కారు యజమాని శేఖర్, అతడి స్నేహితుడు మారిముత్తుగా గుర్తించి, మంగళవారం అరెస్టు చేశారు.

**ఆలూ చిప్స్, వాటర్ బాటిళ్లలో**

## రూ.3కోట్ల విలువైన గంజాయి పట్టివేత



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా హైడ్రోఫోనిక్ గంజాయిని పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుంచి 8.705 కిలోల గంజాయిని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లగేజీలో అనుమానాస్పదంగా ఉన్న 24 ప్యాకెట్లను వారు గుర్తించారు. ఆలూ చిప్స్, వాటర్ బాటిల్స్, ఇతర డబ్బాల్లో తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ గంజాయి విలువ రూ.3.05 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

**తమ కుమార్తెతో సన్నిహితంగా ఉంటున్నాడని..**

## యువకుడి దారుణహత్య

**యర్రగొండపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్కాపురం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. యర్రగొండపాలెంలో ఈ నెల 13న అదృశ్యమైన ఆంజనేయులు అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ఆంజనేయులును వెంకట నారాయణ, రవణ దంపతులు చంపేసి మృతదేహాన్ని కత్తితో ముక్కలు ముక్కలుగా నరికి బోరు బావిలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. తమ కుమార్తెతో ఆ యువకుడు సన్నిహితంగా ఉండటం చూసి భరించలేక ఈ ఘాతుకానికి పాల్పడినట్లు విచారణలో నిందితులు అంగీకరించారు. దంపతులిద్దరినీ యర్రగొండపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**హైకోర్టు న్యాయమూర్తిపై**

## దుష్ప్రచారం కేసులో నిందితుడి అరెస్ట్

**వైకాపా సానుభూతిపరుడిగా పోలీసుల అనుమానం**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసిన కేసులో ఏపీలోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన దామోదర్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతడు వైకాపా సానుభూతిప రుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. దామోదర్ మాత్రం దీనిపై నోరు మెదపట్లేదు. దీనివెనుక ఇంకెవరైనా ఉన్నారా.. అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. నిందితుణ్ని పోలీసు కస్టడీకి తీసుకుని మరింత సమాచారం సేకరించేందుకు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనున్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను కాపాడేందుకు నిందితుడి తండ్రి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎత్తుగడలు వేస్తున్నారని, కేసు విచారిస్తున్న న్యాయమూర్తిపై కూడా ప్రభావం చూపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారు. దీనిపై హైకోర్టు రిజిస్ట్రార్ ఇచ్చిన ఫిర్యాదుతో సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫేస్‌బుక్‌లో పోస్టు ద్వారా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరిపేటకు చెందిన దామోదర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తనకు వచ్చిన పోస్టును ఫార్వర్డ్ చేశానని అంగీకరించాడు. ఆ పోస్టు ఎక్కడ నుంచి వచ్చిందనేది తెలియదంటూ సమాధానమిచ్చాడు. న్యాయమూర్తిపై దుష్ప్రచారం చేసేలా పోస్టును రూపొందించిన వారి గురించి పలుమార్లు ప్రశ్నించినా సరైన స్పందన రాలేదు. దీంతో సోమవారం రాత్రి నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. దామోదర్ తొలుత ఓ గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం చేశాడు. అక్కడ విధుల నుంచి తొలగించడంతో ఆరేళ్లుగా సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్నాడు.

## పిల్లల కోసం మేము సైతం..






ఏ ఇంట్లోనైనా పిల్లలే ప్రపంచం. వారి కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటారు పెద్దలు. అందుకే పిల్లల ఆటపాటల నుంచి అవసరాలూ, భద్రత కోసం వినూత్నమైన ఉత్పత్తులు తెచ్చారు వీళ్లు.

**పాదాలతోపాటే పెరిగే షూ...**

ఎదిగే పిల్లల కోసం షూ ఎంపికచేయడం పెద్ద సవాలు. మోడల్ నచ్చిందంటే, సైజు నప్పదు... సైజు కుదిరిందంటే... మోడల్ విషయంలో రాజీ తప్పదు. పిల్లలు పెరుగుతారు కదా అని... ఎప్పుడూ పెద్ద సైజువే తీసుకుంటారు. కానీ సరిగ్గా సరిపడని షూతో పాదాల ఆకారంలో సమస్యలు వస్తాయని గమనించాడు పుణెకు చెందిన సత్యజిత్ మిత్తల్. 'పదేళ్లు వచ్చేంతవరకూ పిల్లలు వారికి సరిగ్గా సరిపోయే పాదరక్షలు వేసుకోవడం అరుదు. మూడేళ్లలోపు వరకూ పిల్లల్లో ప్రతి మూడు నెలలకూ పాదాల సైజులో మార్పు వస్తుంది. ఆ తర్వాత ఎదుగుదల కొద్దికొద్దిగా ఉంటుంది. వారికి 13 ఏళ్లు వచ్చేంతవరకూ ఈ సమస్య ఉంటుంది. ఆపైన పాదాల సైజులో మార్పు చాలా స్వల్పంగా ఉంటుంది' అని చెబుతారు వ్యాపారిగా మారిన ఈ డిజైనర్. 2020లో పిల్లల పాదాల ఎదుగుదలపైన పరిశోధన చేస్తూ చాలామంది వైద్య నిపుణులతో మాట్లాడాడు. పాదాల అంచుల్లో సున్నితమైన నరాల నిర్మాణం ఉంటుంది... వాటికి అడ్డంకి ఉంటే సమస్యలు వస్తాయని గుర్తించాడు. రెండేళ్ల పరిశోధన తర్వాత పిల్లల పాదాల సైజుతోపాటు పెరిగే షూస్‌ని అభివృద్ధి చేసి... తన స్నేహితురాలు కృతికాలాల్‌తో కలిసి షూ తయారీ కంపెనీ 'అరెట్టో'ను ప్రారంభించాడు. త్రీడీ నిట్టింగ్ టెక్నాలజీని ఉపయోగించి ఈ షూస్ రూపొందిస్తున్నాడు. వీటికి 360 డిగ్రీల ఫ్లెక్సిబిలిటీ ఉండటంతోపాటు 18 మి.మీల వరకూ పెరుగుదల ఉంటుంది. అంటే కనీసం ఏడాదిపాటు ఉపయోగించ వచ్చన్నమాట. ధర రూ.1800- 2600 మధ్యఉంటుంది. ప్రారంభించిన తొమ్మిది నెలలకే ఆరువేల జతలు అమ్ముడయ్యాయి.

**చిన్నారుల భద్రతకో వాచీ...**

దిల్లీకి చెందిన స్మృతీ గోయల్ ఓరోజు తన అయిదేళ్ల చిన్నారిని తీసుకొని ఓ కార్నివాల్‌కు వెళ్లింది. రద్దీగా ఉందక్కడ. భయపడుతున్నట్టే కాసేపటి తర్వాత చేయిపట్టు తప్పి చిన్నారి కనిపించలేదు. అది రెండు నిమిషాలే... అంతలోనే ప్రపంచం తలకిందులైనట్టయిందామెకు. 'చిన్నారి కనిపించింది సరే ఒకవేళ కనిపించకపోతే పరిస్థితి ఏంట'న్న ఆలోచన ఆమెను ఆందోళనకు గురిచేసేది. దేశంలో సగటున ఎనిమిది నిమిషాలకో చిన్నారి తప్పిపోతున్నట్టు నేషనల్ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా లెక్కలు చెబుతున్నాయి. 'మాకు ఇద్దరు అమ్మాయిలు. తర్వాత నుంచి వారిని చూసినప్పుడల్లా పిల్లల ఆచూకీ, భద్రత కోసం సాంకేతికతని ఉపయోగించి ఏదైనా చేయాలనుకున్నాం' అంటారు స్మృతి. తర్వాత తన భర్త అమిత్‌తో కలిసి 'సెక్యో' అనే స్మార్ట్‌వాచ్‌ని తీసుకొచ్చారు. జీపీఎస్, లొకేషన్ ట్రాకింగ్ సదుపాయం దీన్లో ఉంది. దీనిద్వారా పిల్లలు ఎప్పుడు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవచ్చు. అంతేకాదు వారితో సంభాషించవచ్చు కూడా. దీన్లో ప్రత్యేక సిమ్ ఉంటుంది. తల్లిదండ్రుల ఫోన్లో ఆప్‌ద్వారా సిమ్ పనిచేస్తుంది. ఈ స్మార్ట్ వాచ్ ఫోన్‌లానూ పనిచేస్తుంది. లొకేషన్ ట్రాకింగ్, వాయిస్ కాల్(ముగ్గురికి మాత్రమే), స్కూల్ మోడ్, అత్యవసర(ఎస్‌ఓఎస్) బటన్ ఉంటాయి. ధర పెరిగే కొద్దీ వీడియోకాల్ లాంటి మరికొన్ని ఫీచర్లూ తోడవుతాయి. ఇది వాటర్‌ప్రూఫ్ కూడా.

**ఈ రంగులు హానిచేయవు...**


పిల్లలకు కాస్త ఊహ వస్తే పెన్సిళ్లు, క్రేయాన్లు, పెయింట్లతో ఆటలు మొదలు పెడతారు. వాటిలో చాలా వరకూ రసాయనాలతో చేసినవే. అవెక్కడ నోట్లో పెట్టుకుంటారోనని



అనుక్షణం భయమే. ఈతరం తల్లిదండ్రులకు ఆ ఆందోళన అవసరం లేకుండా సహజమైన రంగులూ, నూనెలతో ఉత్పత్తుల్ని తెస్తోంది బెంగళూరుకు చెందిన 'డేబుల్'. నేహా బజాజ్, కరేన్ సల్దాన్హా దీని వ్యవస్థాపకులు. కరేన్ కార్పొరేట్ ఉద్యోగం చేయగా, నేహా యాడ్ ఫొటోగ్రాఫర్. ఇద్దరూ ఓ పెయింటింగ్ శిక్షణ కార్యక్రమంలో పరిచయమయ్యారు. పిల్లల కోసం పర్యావరణ హితమైన ఉత్పత్తుల్ని విదేశాల నుంచి తెప్పించుకునేవారు. ఆ విషయంపైన చర్చించుకుంటున్నప్పుడే అలాంటివాటిని ఇండియాలోనే తయారుచేయాలన్న ఆలోచన వచ్చింది. 2017 నుంచి ఫుడ్ టెక్నాలజిస్టులు, కెమిస్టుల సాయంతో వివిధ ఉత్పత్తులు అభివృద్ధి చేశారు. 2019 నుంచి మార్కెటింగ్ మొదలుపెట్టారు. ముడిపదార్థాల వివరాల్ని ప్యాక్ మీద అందిస్తూ తల్లిదండ్రులకు నమ్మకం కలిగిస్తున్నారు. వీరి ఉత్పత్తుల్లో సహజమైనం, నూనెలూ, రంగులతో చేసిన ఫింగర్ పెయింట్స్, క్రేయాన్స్, బ్రష్‌లు, మౌల్డ్‌లు, ఆర్ట్ కిట్స్... మొదలైనవి ఉంటాయి. ఇవన్నీ ఆరేళ్లలోపు పిల్లలకోసం ఉద్దేశించినవి. 'ప్లే ఆర్ట్' విభాగంలో వచ్చే క్రేయాన్లు జంతువులూ, కార్ల ఆకారాల్లో వస్తాయి. ఐఐఎమ్ బెంగళూరులో ఇంక్యుబేషన్‌కూ ఎంపికైంది డేబుల్. కర్ణాటక ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల గ్రాంటునీ పొందారు వీళ్లు. ఆకర్షణీయమైన ఉత్పత్తులు తెస్తూ పిల్లల స్క్రీన్ టైమ్ తగ్గించడమే తమ లక్ష్యమని చెబుతున్నారు నేహా, కరేన్‌లు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం, 21 మే, 2026




www.viswamvoice.com

### ప్రజలను పలకరిస్తూ

# సైకిల్‌పై ప్రయాణించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**ఎమ్మెల్యే యువత ఉత్సాహంగా స్వాగతం - ఇందన పొదుపుతో పాటు ఆరోగ్య పరిరక్షణ అవసరం**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇందన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య చైతన్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ రోజు నగరంలో సైకిల్ పర్యటన నిర్వహించారు. నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ప్రజలను పలకరిస్తూ సైకిల్ పై ప్రయాణించిన ఎమ్మెల్యేకు స్థానికులు, యువత ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, ఇంధన వ్యయం వంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని యువతతో పాటు ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రోజువారీ జీవితంలో కొంత



సమయం వ్యాయామానికి కేటాయించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. సైకిల్ పర్యటనలో భాగంగా నగరంలోని ఎస్‌కేవీటీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఎమ్మెల్యే వాసు సందర్శించారు. అక్కడ వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి వారి ప్రతిభను అభినందించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే యువత మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లకు పరిమితం కాకుండా క్రీడలు, శారీరక వ్యాయామం వైపు దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తులో నగరంలో క్రీడా అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు కాశీ నవీన్ కుమార్, బుడ్డిగ రవి కూడా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో సైకిల్ తొక్కారు.

### ఎన్టీఆర్ జన్మదిన వేడుకలో

# అన్న క్యాంటీన్ పేదలకు అన్న సమర్పణ

**రా ఎన్టీఆర్ టీం ఇంచార్జి ఎం.ఆనంద్ అధ్యర్యంలో పలు సేవలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా అన్న క్యాంటీన్‌లో రా ఎన్టీఆర్ రాజమండ్రి టీమ్ ఇంచార్జి ఎమ్ ఆనంద్ అధ్యర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కడియం శివ నాయుడు ముఖ్య అతిధిగా పాల్గొని కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాయుడు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు గ్లోబల్ స్టార్ జన్మదిన వేడుకల సందర్భంగా అనేక చోట్ల పలు సేవా కార్యక్రమాలు జరగడం సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం రా ఎన్టీఆర్ రాజమండ్రి టీమ్ సభ్యులు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లమూరి సుబ్రహ్మణ్యం, చైతన్య నాయుడు, రా ఎన్టీఆర్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి సేవిస్తే క్షణాల్లో పట్టేస్తున్న

# పోలీసుల అత్యాధునిక కిట్లు

**కోనసీమలో డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం**

**జిల్లా ఎస్పి రాహుల్ మీనా**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను గంజాయి, మత్తుపదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, మత్తుపదార్థాలు సేవించే వారిని, సరఫరా చేసే వారిని గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతికతను పోలీసులు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజోలు పట్టణ పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, రాజోలు సీఐ సురేష్ బాబు, ఎస్బీ సీఐ పుల్లారావు పర్యవేక్షణలో రాజోలు ఎస్ఐ ఆర్.మల్లికార్జున రెడ్డి, మల్కిపురం ఎస్ఐ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది ఈ సోదాల్లో పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా అనుమానిత వ్యక్తులను నిలిపి అత్యాధునిక గంజాయి, డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. అనుమానితుల నుంచి సేకరించిన నమూనాలను బయో చెక్ కిట్స్ ద్వారా పరీక్షించగా కేవలం రెండు నిమిషాల్లోనే ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ అకస్మాత్తు తనిఖీల్లో మొత్తం 10 మందికి మత్తుపదార్థాలు సేవించినట్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మత్తుకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడానికి వారిని వెంటనే డీ-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించారు. అలాగే వారి పై చట్టప్రకారం కఠిన న్యాయపరమైన చర్యలు కూడా ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. ఇకపై గంజాయి లేదా ఇతర డ్రగ్స్ సేవించి తప్పించుకోవడం సాధ్యం కాదన్నారు. ఈ డిటెక్షన్ కిట్స్ ద్వారా అనుమానితుల మూత్రం లేదా లాలాజల నమూనాలను పరీక్షించి కేవలం రెండు నిమిషాల్లోనే గంజాయితో పాటు 11 రకాల మత్తుపదార్థాలు తీసుకున్నారా లేదా అనేది ఖచ్చితంగా నిర్ధారించవచ్చన్నారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న ఇటువంటి సామాజిక రుగ్మతలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం కొనసాగుతుందని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిఘా, తనిఖీలు కొనసాగుతాయని, మత్తుపదార్థాల విక్రయాలు, రవాణా లేదా వినియోగంలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే మత్తుకు బానిసలైన వారిని గుర్తించి కౌన్సిలింగ్ అందించి డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అత్యాధునిక పరికరాల వినియోగంతో నిందితులను సులభంగా గుర్తించే అవకాశం లభించిందని, రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని పోలీస్ యంత్రాంగం వెల్లడించింది.

### టీడీపీలో చేరిన

# ఎరుకుల సామాజికవర్గ కుటుంబాలు

**పసుపు కండువాలు కప్పి సాదరంగా**

**పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పలివెల గ్రామ పార్టీ అధ్యక్షులు వైవీ కృష్ణ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఎస్టీ సామాజిక వర్గ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వైసీపీని వీడి ఎమ్మెల్యే బండారు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు వారందరికీ పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల, తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై వైసిపి కార్యకర్తలు, నాయకులు తెలుగుదేశంలో చేరారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేయాలని వారికి ఎమ్మెల్యే సూచించారు.

### ఎన్టీఆర్ జిల్లాలో దారుణం..

# ప్రేమ పెళ్లి చేసుకున్న జంటను, వారి కుటుంబాలను వెలివేసిన గ్రామ పెద్దలు

**ప్రేమ పెళ్లి చేసుకున్న రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురంకు చెందిన తేజ, నాగలక్ష్మి కుటుంబాలు సహా జంటను వెలివేసిన గ్రామ పెద్దలు**

**నిబంధనలు ధిక్కరిస్తే రూ. 2లక్షల జరిమానా విధిస్తామని ఊరిలో చాటింపు**



**ఎన్టీఆర్ జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధునిక సమాజంలో ఇంకా కొనసాగుతున్న అనాగరిక కట్టుబాట్లకు అద్దం పడుతూ ఎన్టీఆర్ జిల్లాలో చోటుచేసుకున్న ఒక సామాజిక బహిష్కరణ (వెలివేత) ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన తేజ, నాగలక్ష్మి అనే యువతీయువకులు ప్రేమ వివాహం చేసుకోవడమే వారు చేసిన నేరమైంది. వీరి పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించిన గ్రామ కుల పెద్దలు, సదరు జంటతో పాటు వారి కుటుంబాలను సామాజికంగా వెలివేస్తూ అత్యంత దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. ఆ కుటుంబాలతో గ్రామంలో ఎవరూ మాట్లాడకూడదని, వారి ఇళ్లకు వెళ్లకూడదని, నిబంధనలు ధిక్కరిస్తే ఏకంగా రూ. 2 లక్షల భారీ జరిమానా విధిస్తామని ఊరిలో చాటింపు వేయించడం గమనార్హం. పెద్దల వేధింపులు భరించలేక ప్రేమ జంట ఊరు విడిచి వెళ్లిపోయినప్పటికీ, ఇక్కడ మిగిలిపోయిన అమ్మాయి కుటుంబానికి మాత్రం కష్టాలు తీరలేదు. ఇటీవల ఆ జంటకు బాబు పుట్టడంతో కుటుంబ సభ్యులు బారసాల వేడుక నిర్వహించారు. అయితే ఆ వేడుకకు ఎవరూ వెళ్లకూడదని గ్రామ పెద్దలు మరోసారి ఆంక్షలు విధించారు. చివరికి శుభలేఖలు ఇవ్వడానికి వెళ్లిన కుటుంబ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, గ్రామ తీర్పును ఉల్లంఘించారనే నెపంతో రూ. 2 లక్షలు జరిమానా కట్టాలని హుకుం జారీ చేశారు. ఈ అన్యాయంపై బాధితులు మైలవరం పోలీసులను ఆశ్రయించినా సరైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోరంపై సోషల్ మీడియాలో, సామాజిక వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా, గ్రామాల్లో ఇలాంటి సమాంతర న్యాయస్థానాలు నడుస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాయడంపై మానవ హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అనాగరిక చర్యలకు పాల్పడిన గ్రామ పెద్దలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ఆన్లైన్ మందుల విక్రయాలపై నిరసన

**మండపేటలో మెడికల్ షాపుల బంద్ విజయవంతం**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల అసోసియేషన్ పిలుపుమేరకు ఆలమూరు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మండపేట ఆధ్వర్యంలో బుధవారం ఒక్కరోజు మెడికల్ షాపుల బంద్ పాటించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బొబ్బా రామకృష్ణ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపివేయాలన్నారు.కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలనీ కోరారు.నకిలీ మందుల అమ్మకాన్ని నివారించాలనీ డిమాండ్ చేశారు.మండపేట నియోజకవర్గంలో అన్ని మెడికల్ షాపులు మూతపడ్డాయి.రథం సెంటర్ నుంచి కలవపువ్వు సెంటర్ పెద్ద కలువవంతెన వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. హోల్‌సేల్, రిటైల్ బంద్ జరిగింది.అధ్యక్షుడు బొబ్బ రామకృష్ణ మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించే వరకు దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వెలగల శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ బొడ్డు ప్రసాద్, అన్సార్ అలీ , రామారావు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల హాస్పటల్స్‌లో వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి ధరఖాస్తు చేసుకున్న 43 మందికి రూ.22,50,147/-లు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాగా ఆ చెక్కులను బుధవారం మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుపేద కుటుంబాలకు వైద్య సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారని అన్నారు.నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ సకాలంలో సహాయం అందేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక సహాయం అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే వేగుళ్ళకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితర్లు పాల్గొన్నారు.

# కార్పెంటర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండపేట రామోజీ కృష్ణ

**ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సత్కారం**




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణానికి చెందిన రామోజీ కృష్ణ కార్పెంటర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్ తోట త్రిమూర్తులు ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు ఆయన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సంఘాల తరపున కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికీ మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. రామోజీ కృష్ణకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసిపి టౌన్ ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, వైసిపి నాయకులు సూరంపూడి సత్యప్రసాద్, టేకిమూడి శ్రీను, ఉంద్రాజవరపు అర్జున్, బూర చిన్న, యరమటి వెంకన్న బాబు, అద్దంకి వెంకట రమణ, కోళ్ళ శ్రీను తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

### చిన్నమలేశ్వర క్రికెట్ లీగ్ మ్యాచ్‌లను వీక్షించి క్రీడాకారులను

# అభినందించిన యువనాయకుడు కరణ్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల ఎదురుగా ఎంతో ఉత్సాహంగా జరుగుతున్న చిన్నమలేశ్వర క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను బుధవారం అమలాపురం శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు తనయుడు, యువనాయకుడు కరణ్ వీక్షించారు. ఈ సందర్భంగా మైదానంలో యువ క్రికెటర్లను కలిసి వారి ఆటతీరును అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. యువత శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

విశ్వం వాయిస్

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

గురువారం, 21 మే 2026
www.viswamvoice.com





# కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**కార్మికుడు బలపడితే రాష్ట్రం బలపడుతుందన్న సీఎం చంద్రబాబు దిశానిర్దేశంలో కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం**
**కార్మిక సంక్షేమ శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు మరియు యాజమాన్యాన్ని రెండు కళ్లలా భావిస్తూ సమతుల్యంగా ముందుకు సాగుతోందని కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మికుల సంక్షేమం, భద్రత, ఉపాధి మరియు ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఒక కార్మికుడు పని కోసం యాజమాన్యం వద్దకు వెళ్తే తన ప్రాణాలను వారి చేతిలో పెట్టి వెళు న్నట్టేనని భావించి, యాజమాన్యాలు పూర్తి భద్రతా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గత ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, భవన నిర్మాణ కార్మికులకు అమలులో ఉన్న పథకాలను రద్దు చేసి వారి జీవనోపాధిని దెబ్బతీశారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" మరియు "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తోంద న్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావడంతో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీ దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. భవన నిర్మాణ కార్మికులకు గతంలో నిలిచిపోయిన సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వివాహ కానుకగా రూ.20,000, ప్రసూతి సహాయంగా రూ.20,000, సహజ మరణ సహాయంగా రూ.60,000, అంత్యక్రియల ఖర్చులకు రూ.20,000 అందిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా "లేబర్ అడ్డాస్" ఏర్పాటు చేసి ఉపాధి, విశ్రాంతి, వాష్‌రూమ్, భోజన మరియు శిక్షణ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. రూ.250 కోట్లతో భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుపతి, అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నంలో ఆధునిక ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఫ్యాక్టరీలలో కార్మికుల భద్రత కోసం యూనివర్సిటీలతో ఎంఓయూలు కుదుర్చుకొని థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల్లో జీరో యాక్సిడెంట్స్ లక్ష్యంగా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్మికుడు, యాజమాన్యం రెండూ బలోపేతం కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని మంత్రి తెలిపారు. సంక్షేమం, నైపుణ్యం, ఉపాధి, ఆరోగ్యం, గౌరవం అనే ఐదు స్తంభాలపై రాష్ట్ర కార్మిక రంగాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న కార్మికులు, ఉత్తమ యాజమాన్యాలకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ట్రేడ్ యూనియన్లు, యజమానులు, కార్మిక శాఖ అధికారుల సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. మే డే సందర్భంగా ప్రతి కార్మికుడు గౌరవంగా జీవించేలా, ప్రతి కుటుంబం భద్రంగా ఉండేలా, ప్రతి యువకుడికి ఉపాధి లభించే "స్వర్ణాంధ్రప్రదేశ్" నిర్మాణానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు, యాజమాన్యాలు ఒకే నాణానికి ఉన్న రెండు పార్శ్వాల వంటివారని, వీరిద్దరి మధ్య సమన్వయం ఉన్నప్పుడే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని మంత్రి పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినకార్మికులకు, ఆదర్శవంతమైన యాజమాన్యాలకు మంత్రి పురస్కారాలను మంత్రి, వివిధ కార్పొరేషన్ ఛైర్మెన్లు, కలెక్టర్లు అందించారు. కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్టుమెంట్ కార్యదర్శి ఎమ్. వి. శేషగిరిబాబు మాట్లాడుతూ.. గత సంవత్సర కాలంలో లేబర్ కోడ్స్ దృష్ట్యా, డిపార్ట్‌మెంట్‌లో అనేక మార్పులను తీసుకురావడం జరిగిందన్నారు. సాఫ్ట్‌వేర్ పరంగా, లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు కార్మిక శాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ-శ్రమ్ మరియు దీూజ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను మరింత విస్తృతం చేయడానికి శాఖ కమిషనర్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్మిక శాఖ తరపున సంక్షేమ పథకాలను అమలు చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని కార్యదర్శి శేషగిరి బాబు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వి.మల్లికార్జున రావు (బాజ్జీ), ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సలహా కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘు రామరాజు, ఏపీ కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ పి.శ్రీనివాసులు రెడ్డి, ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు ఉపాధ్యక్షుడు జి.వెంకట శివుడు యాదవ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినాకర్, కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డా॥ జి. లక్ష్మీశ, తదితరులు పాల్గొన్నారు.

**అమలాపురంలో ఘనంగా ముగిసిన**

# జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మే 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026 ఘనంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి వచ్చిన 990 మంది మహిళా, పురుష పవర్ లిఫ్టర్లు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలను అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి ప్రారంభించగా, ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. కోనసీమలో జాతీయ స్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఎంపీకి అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్, ఆసియా ఫెడరేషన్, కామన్‌వెల్త్ ఫెడరేషన్ అనుబంధంతో నిర్వహించిన ఈ పోటీల ద్వారా కోనసీమకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులతో అమలాపురం క్రీడా వేదికగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు కోనసీమ ప్రాంతానికి రైల్వే సౌకర్యం కల్పించాలని ఎంపీ హరీష్ బాలయోగిని కోరారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, కోనసీమలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ వేదికగా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ, క్రీడాకారులకు నేడు జాతీయ స్థాయి గుర్తింపు వస్తే రేపు అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. గెలుపు మాత్రమే కాకుండా పోటీల్లో పాల్గొనడం ద్వారా అనుభవం పెరిగి భవిష్యత్తులో విజయాలు సాధించవచ్చన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరు రోజుల పాటు పోటీలు విజయవంతంగా నిర్వహించామని, పాల్గొన్న క్రీడాకారులకు ఆహారం, నీరు, వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. త్వరలో దక్షిణాఫ్రికాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు క్రీడాకారులు సిద్ధమవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా విశిష్ట అతిథిగా పాల్గొని విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు అందజేశారు. గంధం పల్లంరాజు, ఒంటెద్దు వెంకన్నాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నల్ల పవన్, జిల్లా మరియు రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ జిల్లా తీర ప్రాంతాల్లో పెరగనున్న ఉక్కపోత



**ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్న ఆర్డీఓ ఎ.సరళవతి**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే రోజుల్లో డివిజన్ పరిధిలో ఉష్ణోగ్రతలు మరియు ఉక్కపోత తీవ్రత అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ఏ.సరళవతి పిలుపునిచ్చారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన ప్రత్యేక హీట్ వేవ్ బులెటిన్ ప్రకారం ఈనెల 20వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాతో పాటు రాష్ట్రంలోని తీర ప్రాంత జిల్లాల్లో ఉక్కపోత తీవ్రత విపరీతంగా పెరిగే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్య రక్షణకై మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయవద్దని, ముఖ్యంగా ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఎండ తీవ్రత గరిష్టంగా ఉంటుందని తెలిపారు. కాబట్టి అత్యవసర పరిస్థితులు తప్ప ఆ సమయంలో ఎవరూ బయటకు రాకూడదన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు మరియు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఎండల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దాహం వేయకపోయినా ప్రజలు తగినంత నీరు త్రాగాలని, శరీరంలో లవణాల సమతుల్యత కోసం మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని కోరారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ ధరించాలని లేదా తడి గుడ్డతో తలను కప్పుకోవాలని శరీరానికి గాలి తగిలేలా పలుచని లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం ఉత్తమమని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కూలీలు, రైతులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో పనుల వేగాన్ని తగ్గించుకోవాలని మధ్యమధ్యలో నీడన విరామం తీసుకుంటూ పనులు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగంలోనూ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంటలకు అవసరమైన మేర నీరందిస్తూ భూమిలో తేమ శాతం తగ్గకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు ఆమె తెలిపారు. తీవ్రమైన తలనొప్పి, నీరసం, తల తిరగడం, వాంతులు కావడం లేదా స్పృహ తప్పడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ప్రజలందరూ ఈ హెచ్చరికలను గమనించి స్వీయ రక్షణ చర్యలు పాటించడం ద్వారా ఎండల బారిన పడకుండా సురక్షితంగా ఉండాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కోరారు.

# భూ రీ-సర్వే, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిదియా దేవి**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్షేత్రస్థాయిలో ప్రగతిని మెరుగుపరచేందుకు ప్రతి మండలంలో రోజువారీ, వారపు లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిదియా దేవి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు తరచుగా సమీక్షలు నిర్వహించి ఆశించిన పురోగతి సాధించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లావ్యాప్తంగా భూ రీ-సర్వే పురోగతి, దశలవారీ నిర్వహణ, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ అంశాలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిదియా దేవి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఆర్వో, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భూ రీ-సర్వే ప్రాజెక్టును ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, నిర్దేశిత గడువులోగా అన్ని దశలను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా రీ-సర్వే ప్రక్రియలోని ప్రతి దశపై తహసీల్దార్లతో నిశితంగా సమీక్షించి ప్రతి వారం పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రీ-సర్వే ప్రక్రియ ఏ దశలో ఉందనే అంశంపై గ్రామాల వారీగా క్షుణ్ణంగా సమీక్షించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో తదుపరి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ-కేవైసీ లోపాలను సరిచేసి, రాజముద్ర క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించిన వెబ్‌ల్యాండ్ తదితర అధికారిక పోర్టల్స్‌లో డేటా ఎంట్రీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తహసీల్దార్లకు ఆదేశించారు. ఎంట్రీల్లో ఎటువంటి తప్పులకు తావులేకుండా రికార్డులను కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. 'అందరికీ ఇల్లు' కార్యక్రమాన్ని వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపుతూ, సర్వే నిర్వహణలో తలెత్తుతున్న సాంకేతిక లోపాలు, సరిహద్దు వివాదాలను రెవెన్యూ మరియు సర్వే సిబ్బంది సమన్వయంతో వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. రీ-సర్వే పనులు నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సందర్భంగా డీఆర్వో వి. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేస్తున్న "ఒక గ్రామం - ఒక నెలలో నాలుగు పర్యాయాలు" పర్యటన విధానాన్ని రద్దు చేసి, దానికి బదులుగా ప్రతి నెల ఒక నియోజకవర్గంలో ఒకరోజు జిల్లా కలెక్టర్, సంబంధిత ఎమ్మెల్యే పర్యటించే విధానం అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాలను జూన్ నెలలో రాజోలు మండలంలోని కూనవరం, రామచంద్రపురం మండలంలోని భీమక్రోసుపాలెం, మల్కిపురం మండలంలోని మట్టపర్రు గ్రామాల్లో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి మండలంలో చేపట్టిన రీ-సర్వే పనుల స్థితిగతులు, గ్రామాల వారీగా సాధించిన పురోగతి, డేటా ఎంట్రీలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార చర్యలు, తదుపరి దశల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై తహసీల్దార్లకు విపులంగా వివరించారు. భూ సంబంధిత సేవలు ప్రజలకు త్వరితగతిన అందేలా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, ఆన్‌లైన్ డేటా ఎంట్రీని నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని, పెండింగ్ అంశాలను ప్రాధాన్యక్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు బాధ్యతతో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవో ఏ.సరళావతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, 19 మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# నేడు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

**కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసిన రామచంద్రపురం ఆర్డీఓ ఏ.సరళవతి**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం డివిజన్ పరిధిలో గురువారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల కేంద్రాలను రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ఏ.సరళవతి బుధవారం స్వయంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన కనీస వసతులను ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సరళవతి మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడుతాయని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరూ ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా నిర్దేశిత సమయానికంటే అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు. ప్రస్తుత వేసవి తీవ్రత మరియు వడగాల్పులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆర్డీఓ వివరించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ చల్లని తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. అలాగే పరీక్ష రాసే గదుల్లో (క్లాస్ రూమ్స్) ఫ్యాన్లు, లైట్ల సదుపాయం సరిగ్గా ఉందో లేదో స్వయంగా తనిఖీ చేశారు. ఎండల దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద తక్షణమే మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని విద్యార్థుల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. రామచంద్రపురం మండలంలోని వివిధ కేంద్రాల్లో పరీక్ష రాసే విద్యార్థుల వివరాలను ఆర్డీఓ ఈ సందర్భంగా వెల్లడించారు. రేపు జరగబోయే పరీక్షకు వికాస్ జూనియర్ కళాశాల కేంద్రంలో సుమారు 62 మంది, నారాయణ జూనియర్ కాలేజీలో 63 మంది, కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో 154 మంది, మరియు పామర్రు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 121 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆమె తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో రాసేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్డీఓ సరళవతి స్పష్టం చేశారు.

# సహజ కవి వెంకట పొలమూరికి సన్మానం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సహజ కవి వెంకట్ పొలమూరిని రాజమహేంద్రవరంలో వివిల్ పురం ఎల్ఐసి ఉద్యోగుల భవనంలో లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారని ఒక ప్రకటనలలో ఆయన బుధవారం తెలిపారు అంబేద్కరీయం కవులు గాయకుల సమ్మేళనంలో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన ప్రముఖ సామాజిక సహజకవి, కవిరత్న వెంకట్ పొలమూరి మనం అల్పులం కాదు మదపుటేనుగులం అని కవితా గానం చేసినందుకు వెంకట్ పొలమూరిని ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గూటం స్వామి, బి. వి.వి.సత్యనారాయణ కవులు, గాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు


**మొక్కలు, మజ్జిగ పంపిణీ చేసిన సేవా సమితి**



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు ప్రజల అభిమాన కథానాయకుడు "మ్యాన్ ఆఫ్ మాసస్" యంగ్ టైగర్ శ్రీ నందమూరి తారక రామారావు (జూనియర్ ఎన్టీఆర్) జన్మదినోత్సవ వేడుకలు రామచంద్రపురం నియోజకవర్గంలో అత్యంత వైభవంగా జరిగాయి. రామచంద్రపురం నియోజకవర్గం ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ద్రాక్షారామ బోస్ బొమ్మ సెంటర్ వద్ద అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి కోలాహలంగా ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానుల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సందడి చేశారు. అనంతరం సామాజిక బాధ్యతగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి సుమారు 3,000 మందికి పైగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కొరకు ద్రాక్షారామ టాక్సీ స్టాండ్ యూనియన్ ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులకు మరియు స్థానిక మహిళలకు కలిపి సుమారు 100 మందికి పైగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో ఎన్టీఆర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు శ్రీ వాసంశెట్టి శ్యామ్, అధ్యక్షుడు సాదే రాజేష్ కుమార్, సెక్రెటరీ శీలం మణికంఠ, ఆర్గనైజర్ సెక్రెటరీ కుడిపూడి క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి పాటి సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు దొమ్మేటి సతీష్, పెద్దిరెడ్డి శంకర్, కాటే రవి రాజా, కుయ్యేరు లక్ష్మణ్, పంపన దుర్గాప్రసాద్, ఈనకోటి సతీష్, వజ్రపు భీమేష్, గుత్తులరాజు మరియు నియోజకవర్గ నలుమూలల నుండి తరలివచ్చిన యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను ఘనంగా జయప్రదం చేశారు.

**శ్రీ మందేశ్వర(శనేశ్వర) స్వామిని దర్శించుకున్న**

# తిరుపతి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కే.జనార్ధన్ నాయుడు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మందేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేసిన తిరుపతి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కే.జనార్ధన్ నాయుడు శ్రీ స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకునియున్నారు. ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించిన ఆలయ కార్యదర్శి సురేష్ బాబు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అధికారులు భక్తులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు, ప్రయోజనాల కోసం శ్రమిస్తున్న సూరిబాబుకు అవార్డు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ ఆధ్వర్యంలో శ్రమశక్తి 2026 అవార్డును విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతులు మీదుగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ టిఎన్టియుసి కార్యదర్శి బండారు సూర్య నారాయణ (సూరిబాబు) అందుకున్నారు. కార్మికుల హక్కులు, ప్రయోజనాల కోసం శ్రమిస్తున్న సూరిబాబుకు ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాము అని ముత్యాల బాబ్జి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కడలి భీమేశ్వరరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# వరి పొలాల వ్యర్థాల పొగాకు కౌలు రైతు బలి



**వేగాయమ్మపేటలో తీవ్ర విషాదం**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. వరి పొలాల వ్యర్థాల నుంచి వచ్చిన దట్టమైన పొగలో చిక్కుకుని ఒక కౌలు రైతు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన వేగాయమ్మపేట గ్రామంలో స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. రామచంద్రపురం నియోజకవర్గంలో గత కొద్దిరోజుల క్రితమే వరి కోతలు ముగిశాయి. ఈ క్రమంలో వేగాయమ్మపేట గ్రామంలో వరి పొలాల కోయకాడలకు (వరి వ్యర్థాలకు) నిప్పంటించారు. అయితే, ఆ సమయంలో పొలంలో ఉన్న కౌలు రైతు లిగుబ్బల సూరిబాబు (36) ఆ వ్యర్థాల కాల్పివేత వల్ల వచ్చిన దట్టమైన పొగలో చిక్కుకుపోయాడు. పొగ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఊపిరి ఆడక అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవలి కాలంలో రైతులు వరి పొలాల వ్యర్థాలకు నిప్పంటిస్తున్న క్రమంలోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



# తహాశిల్దార్ కార్యాలయంలో ప్రాణాంతక చెట్లు..!



ఏడాకుల చెట్లను తొలగించమన్న ఉపముఖ్యమంత్రి

తొలగించడంలో రెవెన్యూ శాఖ అశ్రద్ధ

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని తాహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రాణాంతక చెట్లు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి ఆయా పనులపై వచ్చే ప్రజలు కాసింత విరామం, వారి పని అయ్యే వరకూ కార్యాలయం ప్రాంగణం ముందు భాగంలో ఉన్న చెట్లే నీడతో ఆసరాగా నిలుస్తున్నాయి. అయితే అన్ని చెట్ల మధ్య రెండు ప్రాణాంతకమైన ఏడాకుల చెట్లు ఉన్నాయి. ఈ ఏడాకుల చెట్టు అనేది అపోసైనేసి కుటుంబానికి చెందిన ఒక నిత్యహరిత వృక్షం. ఈ చెట్టు కొమ్మకు ఒకే చోట ఏడు ఆకులు వృత్తాకారంలో అమరి ఉండటం వల్ల దీనికి 'ఏడాకుల చెట్టు' లేదా సంస్కృతంలో 'సప్తపర్ణి' అనే పేరు వచ్చింది. ఆంగ్లంలో దీనిని సాధారణంగా 'డెవిల్ ట్రీ' అనీ 'బ్లాక్‌బోర్డ్ ట్రీ' అని పిలుస్తారు. గిరిజన ప్రాంతాల్లో, పశ్చిమ కనుమల ప్రజల్లో ఈ చెట్టు కింద రాత్రి పూట కూర్చుంటే దెయ్యం పడుతుందనే ఒక నమ్మకం ఉండేది గనుక 'డెవిల్ ట్రీ' (దెయ్యం చెట్టు) అని కూడా పిలుస్తారు. ఈ చెట్లు చాలా వేగంగా, నిటారుగా ఎత్తుగా పెరుగుతాయి. ఇవి అక్టోబర్, నవంబర్ నెలల్లో తెల్లటి పూల గుత్తులు పూస్తాయి. ఈ పూల నుంచి రాత్రి వేళల్లో అత్యంత ఘాటైన, తీవ్రమైన సువాసన వస్తుంది. ఈ ఘాటైన వాసన కారణంగా పూర్వం ప్రజలు దీనిని ఒక మాయా వృక్షంగానూ, కీడు చేసే చెట్టుగా భావించి దూరంగా ఉండేవారు. అందుకే దీనికి 'డెవిల్ ట్రీ' అనే పేరు స్థిరపడి పోయింది. ఆయుర్వేదంలో సంప్రదాయ వైద్యంలో దీని బెరడును మలేరియా జ్వరం, చర్మ వ్యాధులు, కడుపు నొప్పి నివారణకు ఉపయోగిస్తారు. దీని కలప చాలా తేలికగా ఉంటుంది. పూర్వం పాఠశాలల్లో వాడే పలకలు పెన్సిళ్ల తయారీకి దీని కలపను ఎక్కువగా వాడేవారు, అందుకే దీనికి 'స్కాలర్ ట్రీ' లేదా 'బ్లాక్‌బోర్డ్ ట్రీ' అనే పేరు వచ్చింది. పట్టణాలలో రోడ్డు పక్కన కాలుష్యాన్ని, వాహనాల నుంచి వచ్చే శబ్ద కాలుష్యాన్ని నియంత్రించ డానికి మున్సిపాలిటీలు ఈ చెట్లను ఎక్కువగా నాటుతుంటాయి. అయితే ఈ చెట్ల వలన మనుషులకు ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ చెట్టు పూలు పూసే కాలంలో వచ్చే ఘాటైన వాసన, పరాగ రేణువుల వల్ల శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా, సైనస్ ఉన్న రోగులు ఇబ్బంది పడుతుంటారు. ఇటీవల కాలంలో కొందరు ఈ ఏడాకుల చెట్టును పర్యావరణానికి, భూగర్భ జలాలకు హాని చేసే 'కోనోకార్పస్' అనే మరో రకం పరాయి దేశపు చెట్టుతో పొరబడుతున్నారు. కోనోకార్పస్ చెట్ల వల్ల తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు వస్తున్నందున వాటిని తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దశలవారీగా తొలగించాలని ఆదేశించారు. కానీ ఆ ఆదేశాలు ఇక్కడ అమలు కావడం లేదు. బహుశా ఈ చెట్లను నరికించి తొలగించడానికి ప్రత్యేకంగా నిధులు ఏమైనా మంజూరు కావాలేమో మరి. అధికారుల ఉదాసీనత ఫలితంగా ఈ చెట్ల కిందనే ప్రజల కోసం కాంక్రీట్ సిమెంట్ బెంచీలను కూడా ఏర్పాటు చేసారు. ఎంతటి వారైనా ఈ చెట్ల కింద బెంచీల మీద కాసింత విరామం తీసుకోవాల్సి వస్తోంది. ఐతే ఈ నీడ నిచ్చే చెట్లే ప్రాణాంతకయ్యే చెట్లన్న విషయం అందరు ప్రజలకూ తెలియదు. ఈ కార్యాలయం సిబ్బంది అందరికీ ఈ ప్రాణాంతక చెట్ల గురించి ఆది నుంచీ తెలిసినా వాటిని తొలగించడంలో ఇప్పటి వరకూ ఇక్కడ విధులను నిర్వహించిన గత 26 మంది మంది ఎమ్మార్వోలు, తాహసిల్దార్లూ ఉపేక్షిస్తూ వస్తూనే ఉన్నారు. గతంలో అన్నవరం పోలీసు స్టేషన్ ప్రాంగణంలోని ఏడాకుల చెట్లను నరికించి తొలగించారు. మండల మెజిస్ట్రేట్ కార్యాలయ ప్రాంగణంలోని చెట్లను తొలగించడంలో ఎవరూ శ్రద్ధ, చొరవ చూపించడం లేదు. బహుశా... చేతులు కాలాకనే ఆకులు పట్టుకుంటారేమో...!

జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరిన

# ఉమ్మిడి వెంకటరావు

ప్రత్తిపాడు కాంగ్రెస్ ఇంచార్జిగా "ఉమ్మిడి" నియామకం
పార్టీ పునరుజ్జీవానికి కృషి చేస్తానన్న వెంకట్రావు




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా ఉప అధ్యక్షుడిగా, ప్రత్తిపాడు నియోజకవర్గం జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా సేవలను అందించి, 2019 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలిచిన ఉమ్మడి వెంకటరావు గురించి జిల్లా ప్రజలకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈయన తిరిగి కాంగ్రెస్ పార్టీ గూటికే తాజాగా చేరారు. గతంలో కాకినాడ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా ఉన్నప్పుడు తనకు పార్టీలో సరైన ప్రాధాన్యత దక్కడం లేదన్న ఒకే ఒక్క కారణంతో తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతర కాలంలో... ప్రస్తుతం జాతీయ కాంగ్రెస్ పార్టీకి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాదరణ లభిస్తున్న నేపథ్యంలో ఈయన తిరిగి తన సొంత పాత పార్టీ గూటికే చేరారు. విజయవాడలోని జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ సమక్షంలో మంగళవారం పార్టీలో చేరారు. ఈయనతో పాటు నియోజకవర్గంలోని ప్రముఖులు, సీనియర్ నాయకులు ఊటా శ్రీను, రామకుర్తి సూర్యనారాయణ, యనుమల రాజా, దొంతంశెట్టి చంద్రశేఖర్, గూనాపు శ్రీనివాస్, యనుమల కిరణ్, ఈపీ రమణ తోపాటు మరి కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ షర్మిళ కండువాలను కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంటనే ఉమ్మిడి వెంకటరావును ప్రతిపాడు నియోజకవర్గ ఇన్చార్జిగా షర్మిల నియమించారు. ఈ నియామకాన్ని మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్ళంరాజు (ఎం.ఎం. పల్లంరాజు), కాకినాడ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు (చిట్టిబాబు) సమక్షంలో షర్మిళ అధికారికంగా ప్రకటించారు. పార్టీ నియామక పత్రాన్ని కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పార్టీ పునరుజ్జీవానికి, బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీని గ్రామ స్థాయిలో మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, వచ్చే ఎన్నికల్లో పార్టీ తరపున తానే పోటీ చేస్తానని "విశ్వం వాయిస్ న్యూస్" కు ఉమ్మిడి తెలిపారు. ఈ చేరిక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఇంచార్జి గణేష్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ పాలక్ వర్మ, పార్లమెంట్ ఇంచార్జి మల్లెపూడి రాంబాబు, పెద్దాపురం ఇంచార్జి మలకల సూరిబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు


# ఆర్థిక సాయం చేసిన వైసీపీ నేతలు

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్లో ఇటీవల లారీ ప్రమాద దుర్ఘటనలో మృతి చెందిన ఐదుగురు మహిళల కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 లక్షల పరిహారం ప్రభుత్వం అందజేయాలని కాకినాడ రూరల్ వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఆ వైసీపీ నాయకులు ఐదుగురు మహిళ బాధిత కుటుంబాలు దగ్గరకు వెళ్లి ఒక్కొక్కరికి 30 వేల రూపాయలు చొప్పున పరిహారాన్ని అందించి తమ సేవా గుణాన్నిచాటుకున్నారు. కాకినాడ రూరల్ జడ్పిటిసి నురుకుర్తి రామకృష్ణ (కిట్టు), స్థానిక నాయకులు గుడాల నాని బాబు, కొప్పిశెట్టి గణేష్ ఈ ముగ్గురు కలిసి ఒక్కొక్కరు 10వేలు చొప్పున 30వేల రూపాయలను మృతుల కుటుంబాలకు అందించారు. మృతుల కుటుంబాలకు కుటుంబాలకు 25 లక్షల పరిహారం ప్రభుత్వం వెంటనే అందజేయాలని అలాగే వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం చేయకుండా అందించి వారికి అన్ని విధాలుగా ప్రభుత్వం సహాయ పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ వైసీపీ నాయకులు అనుసూరి ప్రభాకర రావు, బీఆర్ రాయ్, బొంతు లీలా కృష్ణ, పెంకే రాధా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# హోటల్స్ రంగం ద్వారా గ్యారెంటీ ఉపాధి



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పర్యాటక రంగ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ తోడ్పాటును అందించి తనవంతు కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. హోటల్స్ రంగంలోనే గారెంటీ ఉపాధి ఉంటుందని వారికి ఒక్కొక్కరికి 10వేల నుండి 5 లక్షల వరకు వేతనం అందిస్తున్నట్లు వారు చెప్పారు. ఏ రంగంలో ఉన్న సరే ఉద్యోగ, ఉపాధికి గ్యారెంటీ ఉండదని హోటల్ రంగంలో మాత్రం అది నిరంతరం ఉంటుందని తమ అభిప్రాయాన్ని వారు వెల్లడించారు. బుధవారం స్థానిక వెంకీ రెసిడెన్సీ హోటల్లో అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి, కార్యదర్శి చిట్టూరి మూర్తి, సభ్యులు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్రంలో బార్ లైసెన్స్ ఫీజులను ప్రభుత్వం తగ్గించిందని,ముఖ్యంగా స్టార్ హోటల్స్‌లో ఉన్న 65 నుండి 25 శాతంకు ఈ ఫీజులను తగ్గించడం పట్ల ప్రభుత్వానికి అసోసియేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైక్రో బెవరేజెస్ కాన్సెప్ట్ను ప్రోత్సహిస్తోందని, ఇందులో భాగంగా త్వరలోనే స్టార్ హోటల్స్‌ మైక్రో బెవరేజిస్ను ప్రారంభించబోతున్నామని తెలిపారు. రాష్ట్రానికి ఉన్న 954 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరంలో టూరిజాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం బీచ్ షాక్ పాలసీని కూడా ప్రోత్సహిస్తోందిని రాబోయే కొద్దిరోజుల్లో దీన్ని మరింతగా విస్తరించనున్నారు. వాణిజ్య వినియోగ సిలిండరు ధర ఏకంగా 1337 రూపాయల వరకు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎన్జి వాడకాన్ని ప్రోత్సహించినప్పటికీ, ప్రస్తుతం వీటి ధరలు కూడా విపరీతంగా పెరిగాయన్నారు. గ్యాస్, పీఎన్జీ ధరల పెరుగుదల వల్ల కుదేలవుతున్న హోటల్ రంగాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని ప్రకటించాలని కోరారు. రాజధాని అమరావతిలో హోటల్స్ రంగంలో వస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణకు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించినందుకు ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు ఆర్వి స్వామి, ఉపాధ్యక్షులు జి వెంకట కృష్ణ, కార్యదర్శి సిహెచ్ మూర్తి, సంయుక్త కార్యదర్శి ఎంవి పవన్ కార్తీక్ ,కోశాధికారి శివ కుమార్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

# పేదల పాలిట గొప్ప వరం సీఎం సహాయనిధి

-కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి)



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) ఆధ్వర్యంలో బుధవారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గంలోని ముగ్గురికి లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి హయాంలో సీఎం సహాయనిది పేదలకు అందని ద్రాక్షలా ఉండేదని అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందజేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్ గౌడ్,తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాందేవు సీతయ్య దొర, కరప మండలం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గుల్లిపల్లి శ్రీనివాస్,తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కౌజు నెహ్రూ, గుబ్బల భాస్కరరావు, పబ్బినేడి సోమరాజు,చెల్లిబోయిన సూర్యప్రకాశరావు, కాకరపల్లి చలపతిరావు, కంచుమర్తి లావణ్య,గుడాల లోవరాజు, పొదరుపు ఉమా, పిల్లి వీరభద్రరావు, మార్కండేయులు, మందరపు చిట్టిబాబు, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# కలెక్టరేట్‌లో రెస్పాన్స్ సెంటర్ ప్రారంభం : కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, వేగవంతంగా అందించడంతో పాటు ప్రజా సమస్యలను సత్వరం పరిష్కారించేందుకు కాకినాడ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన "ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటరు" సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నిరాకరణ, ఆలస్యం, ప్రభుత్వ సేవల కోసం ఎవరైనా డబ్బులు అడిగిన సందర్భాలు, ప్రస్తుత ధాన్యం కొనుగోలు సీజన్‌కు సంబంధించిన సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు, భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, ఇతర ఆకతాయిల బెదిరింపులు, అనధికార లే ఔట్లు వంటి సమస్యలను ఈ సెంటర్ ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్ -9849903879 కు జిల్లా వాసులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, అలాగే వాట్సప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. కలెక్టరేట్ లో ఈ హెల్ప్‌లైన్ రోజూ 24 గంటలు, వారంలో 7 రోజులు నిరంతరం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కాల్ సెంటర్ సిబ్బంది ప్రతి కాల్‌ను స్వీకరించి, సంబంధిత శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించి అప్రమత్తం చేయడం ద్వారా సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా వ్యవస్థ ఏర్పాటు చేసామన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి వెంటనే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుందని తెలిపారు. అదే విధంగా అవినీతికి సంబంధించిన ఫిర్యాదుల కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అవినీతి నిరోధక టోల్ ఫ్రీ నెంబర్ 14400 ను కూడా ప్రజలు వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ జిల్లా ప్రజల పక్షాన నిలిచి, ప్రజలకు మేలు చేసే ప్రతి అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను 9849903879 నెంబర్‌కు ఫోన్ చేసి లేదా వాట్సప్ ద్వారా తెలియజేసి ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు.

సీఎం సహాయనిధి చెక్కులు

# పంపిణీ చేసిన ఎమ్మెల్యే నానాజీ




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ గుడారగుంట శాసనసభ్యులు పంతం నానాజీ కార్యాలయం వద్ద పేద ప్రజలకు ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 294 మందికి ఆర్థిక సహాయాన్ని అందించి వారి కుటుంబాలను ఆదుకోవడం జరిగిందని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మూడు LOC లతో కలిపి 27 మందికి మంజూరు అయిన 22 లక్షల 14 వేల 802 రూపాయల చెక్ లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గం నుండి 379 అప్లికేషన్స్ పంపించగా 294 మందికి 2 కోట్ల 76 లక్షల 60వేల 167 రూపాయలు ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా హాస్పటల్లో ఇబ్బందులు పడి అప్పుల పాలైన పేదల కుటుంబాలకు చేయిత అందించామన్నారు. ఇంకా 85 అప్లికేషన్స్ పరిశీలనలో ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# "హెల్మెట్ వాడండి, ప్రాణాలను కాపాడుకోండి"

ట్రాఫిక్ పోలీస్..




**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ట్రాఫిక్ -1 ఇన్స్పెక్టర్ ఎన్ రమేష్, ట్రాఫిక్ 2 ఇన్స్పెక్టర్ డి.రామారావుల ఆధ్వర్యంలో నగరంలో హెల్మెట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే నగరంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక 'ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నైజేషన్' కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి ఆన్‌లైన్ లోనే నేరుగా జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# జూన్ 1 నుంచి జిల్లాలో సర్ ప్రక్రియ ప్రారంభం

రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో డాక్టర్ తిప్పేనాయక్ సమావేశం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో జూన్ 01 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ 2026 ప్రక్రియకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ డీఆర్వో తిప్పే నాయక్.. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎస్ఐఆర్-2026 షెడ్యూల్, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి జూన్ 01 నుంచి స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ - సర్ ప్రక్రియకు షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఓటరు జాబితాల స్వచ్ఛీకరణ లక్ష్యంగా జూన్ 01 నుంచి జిల్లాలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ 2026 ప్రక్రియను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించడంలో రాజకీయ పార్టీలు తమ వంతు సహాయ సహకారలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమం క్రింద యునీక్ ఎన్యూమరేషన్ ఫారమ్స్ ద్వారా ప్రస్తుతం నమోదై ఉన్న ఓటర్ల వివరాలను ఎఐఆర్-2002 డేటాలోని వారి, లేదా వారి బంధువుల వివరాలతో మేచింగ్/లింకింగ్ నిర్వహించడం జరుగుతుందని, దాని ఆధారంగా అర్హులను, అనర్హులను నిర్ధారించి ఓటరు జాబితాలను సవరించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కమీషన్ సూచనల కనుగుణంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో తమ బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని డీఆర్వో రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నరాల శివ(ఆప్), ఎస్.అప్పారావు (బిఎస్పి), సిహెచ్.రమేష్ బాబు (బిజేపి), కె.ప్రసాద్ (సిపిఐ-ఎం), పోలిశెట్టి శ్రీనివాస్ (ఐ ఎన్ సి), గదుల సాయిబాబా (టిడిపి), రావురి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్-సీపీ), ఎస్.రామకృష్ణ, సత్యన్నారాయణ (జెఎస్పి), ఎలక్షన్ సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం, డీటీ జీఎన్వీ.తేజ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్స్ బంద్ - ఎమ్మెల్యేకి వినతిపత్రం




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ది కాకినాడ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కాకినాడ శ్రీ సాయిరాం సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు గిరిధర్ అధ్యక్షతన ఈరోజు కాకినాడ రూరల్‌లో మెడికల్ షాపులను బంద్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ షాప్ యాజమాన్లు భారీ ర్యాలీతో కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ స్వగృహానికి చేరుకుని ఆయనకు వాళ్లు నష్టపోతున్న సమస్యల మీద వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ జి ఎస్ ఆర్ 817 ఈ, జి ఎస్ ఆర్ 220 ఈ సంబంధించి పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టిన ఆమోదం పొందలేదని అయినా ఆన్లైన్ వ్యాపారాలు నిర్వహిస్తూ మెడికల్ షాపుల జీవనోపాధికి గండి కొడుతున్నారని వారు తెలిపారు . అయితే ఫార్మసిస్ట్ పర్యవేక్షణలో మందులు ఇవ్వాలి తప్ప ఆన్లైన్లో మందులు ఇవ్వాలా లేదా అన్నది ప్రజా అభిప్రాయం ద్వారా ముందుకు వెళ్తే మంచిదని దీనికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో చర్చిస్తానని అన్నారు. మెడికల్ షాపుల జిల్లా అధ్యక్షుడు గిరిధర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టి 12 లక్షల 40000 మందుల షాపులను స్వచ్ఛందంగా మూసి వేయడం జరిగింది అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ది కాకినాడ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సెక్రెటరీ కే.సురేష్, ట్రెజరర్ హనుమంతరావు, యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రభుత్వ విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు అమలు

**ప్రభుత్వ బడిలో విద్యార్థులకు బంగారు భవిష్యత్ - ప్రభుత్వ పాఠశాలలో అత్యున్నత ఫలితాలు నమోదు**

**సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కుడిపుడి సత్తిబాబు**

**కుడుపూడి సత్తిబాబు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేత**






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరంలోని స్థానిక మూడవ వార్డు పరిధిలోని నెహ్రూ నగర్ మున్సిపల్ హై స్కూల్లో పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందిన 22 మంది విద్యార్థులకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం 1,10,000 రూపాయల ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు అమలు చేశారని కొనియాడారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు అధికంగా చదివే ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దుతూ విద్యా ప్రమాణాలను పెంచారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం, ఉత్తీర్ణత శాతం పెరగడమే కాకుండా అత్యుత్తమ ఫలితాలు నమోదవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫార్ములు, బ్యాగులు, బూట్లు వంటి సౌకర్యాలను ఎలాంటి రాజకీయ ముద్రలు లేకుండా అందించడం ద్వారా రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛమైన విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వాస్తవ దృక్పథానికి నిదర్శనమని తెలిపారు. అలాగే రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని, పాఠశాలలను స్వయంగా సందర్శించి గ్రౌండ్ స్థాయిలో పర్యవేక్షణ చేయడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థ మెరుగుదలకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థులంతా ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా చదువులో రాణించాలని, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

### బూటకపు హామీలతో

# అస్తవ్యస్త పాలన సాగిస్తోంది

**డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆరోపణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కోటమ్మ ప్రభుత్వం దుర్మార్గంగా అస్తవ్యస్త పాలన సాగిస్తోందని రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆరోపించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తో కలిసి మంగళవారం మార్గాని ఎస్టేట్స్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు జిల్లాలో ప్రాధాన్యత లేదని, తక్కువగా ఉన్నారని ఎల్లో మీడియాలో రాస్తున్నారని ఆరోపించారు. వారు రాసిన పత్రికలోనే భిన్నమైన సమాచారం ఇచ్చారన్నారు. ఎన్నో అబద్ధాలు బుట్ట హామీలతో అధికారంలోకి వచ్చిన చోట ప్రభుత్వం అన్నిటిని తుంగలోకి తొక్కి ఆస్తవ్యస్థ దుర్మార్గ పాలన సాగిస్తోందని ఆరోపించారు. జిల్లాలో ఎక్కడ చూసినా మట్టి, ఇసుక దోపిడీ జరుగుతుందని, విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, ఇటువంటి దందాలే పాలనగా సాగిస్తున్నారని దుయ్యబట్టారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజీనామా చేయాలని వైయస్సార్సీపి డిమాండ్ చేస్తోందన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అని చెప్పి ఎగనామం పెట్టారన్నారు.

# రైతులు వరి నుండి ఆయిల్ ఫామ్ సాగుకు మారాలి

**ఆదాయం కన్నా ఆరోగ్యం మిన్న : మల్లికార్జున రావు, బొడ్డ**

**ప్రకృతి రసాయనాలపై రైతులకు సంపూర్ణ అవగాహన**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులు ప్రస్తుత పరిస్థితుల రీత్యా ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకుంటూ వరి నుండి ఆయిల్ ఫామ్ సాగు వైపు దృష్టి సారించాలని జిల్లా హార్టికల్చర్ అధికారి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం మండలంలో బూరుగుపూడి గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సులో పీఎండీఎస్ సాగు, వరి నుంచి ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా హార్టికల్చర్ అధికారి మల్లికార్జునరావు మాట్లాడుతూ రైతులు వరి నుండి ఆయిల్ ఫామ్ వైపు వ్యవసాయాన్ని సాగిస్తే ప్రభుత్వం మంచి ప్రోత్సాహాలు ఇస్తుందని, ఆయిల్ ఫామ్ రైతులకు అనునిత్యం మంచి ఆదాయాన్ని తెచ్చిపెడుతుందన్నారు. ఆయిల్ ఫామ్ వేసే రైతులకు ఆయిల్ ఫామ్లో అంతర్ పంటలు, కూరగాయల పంటలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి బొడ్డ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంతో మేలైన పంటలను పండించి ప్రజారోగ్య పరిరక్షణ తో పాటు నేలతల్లిని సంరక్షించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రైతులు ఆదాయం కన్నా కుటుంబ సభ్యుల ఆరోగ్యసభ్యులు, ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు, జీవామృతం, ఘన జీవామృతం, గోల్డెన్ బయో లెట్టర్ తయారీ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.జెడిహెచ్ పశు వర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు రైతులకు గోకులాలు, పశువులకు ఉచిత వైద్యం, పశు గ్రాసంపై ప్రభుత్వము రాయితీ వంటి అంశాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులను వివిధ శాఖల జిల్లా అధికారులు ఘనంగా సత్కరిస్తూ అవార్డులు అందజేశారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సుగుణ,ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, ఏడిఏ శ్రీనివాసరావు, పశువర్ధకశాఖ అధికారులు ఎన్ వెంకటేశ్వర్లు, ప్రభావతి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు కంటే నాగ కేశవరావు, అడపా వీరబాబు, హార్టికల్చర్ అధికారిణి రిణి, వ్యవసాయశాఖ అధికారులు గౌరీదేవి, రామ తులసి, విఏలు,విహెచ్ లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాల నిలుపుదల అరికట్టాలి

**కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలి -మెడికల్ షాపుల బంద్ విజయవంతం**

**కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గోకవరం బస్టాండ్ మీదుగా దేవీచౌక్ వరకు ర్యాలీ**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అఖిల భారత కెమిస్టుల సమాఖ్య పిలుపు మేరకు ఆల్ ఇండియాలో ఈస్ట్ గోదావరి డ్రగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్, ది రాజమండ్రి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ షాపుల యజమానులు బుధవారం ఒక రోజు సమ్మె చేసారు. బంద్ నేపథ్యంలో రాజమహేంద్రవరం నగరంలోని మెడికల్ షాపులన్నీ మూతపడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక ఆనం కళాకేంద్రం వద్ద నుంచి గోకవరం బస్టాండ్ మీదుగా దేవీచౌక్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవ హారం నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలని, నకిలీ మందుల అమ్మకాన్ని నివారించాలనే డిమాండ్‌తో ఈనెల 19వ తేదీ అర్థరాత్రి నుంచి 12వ తేదీ అర్థరాత్రి వరకు మెడికల్ షాపులు హోల్ సేల్ అండ్ రిటైల్ బంద్ చేసిన్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2 వేల 250 మెడికల్ షాపులు ఉన్నాయని అవన్నీ బంద్ పాటించారని తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు దేశవ్యాప్తంగా శాంతి యుత నిరసనలు చేపడతామని హెచ్చరించారు. నగరంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో నాలుగు దుకాణాలు తెరిచి మందులు విక్రయం విషయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా సహకరించామన్నారు. తమకు మద్ధతుగా నిలిచిన ఐఎంఎ, కార్పొరేట్ మెడికల్ షాపుల యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు. , గౌరవ అధ్యక్షుడు బలభద్ర వెంకట రాజు (రాజా), రాజమండ్రి అధ్యక్షుడు పిల్లా బాల, అసోసియేషన్ ప్రతినిధులు పిండి గణపతి, కె.శ్రీనివాసరావు, సిహెచ్ ఫణీంద్ర, వై.లీలాధర్, కృష్ణ, గుప్తా, వీరబాబు, జిల్లా అడ్మిన్ బొప్పన కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 26 వరకు జిల్లాలో

# వడగాలుల ప్రభావం

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అత్యవసరం అయితేనే మధ్యాహ్న సమయంలో బయటకు రావాలని రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 26వ తేదీ వరకు జిల్లాలో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అత్యవసరం అయితేనే బయటకు రావాలని, తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**వడదెబ్బ లక్షణాలు గుర్తించాలి**

తలనొప్పి, అధిక దాహం, అలసట, వాంతులు, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తులను చల్లటి ప్రదేశంలో ఉంచి, నీరు లేదా ద్రవ పదార్థాలు అందించాలని తెలిపారు. కూలీలు, రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కూలీలు, రైతులు, నిర్మాణ కార్మికులు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు నిర్వహించుకోవాలని సూచించారు. తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, తరచుగా నీరు తాగడం, నేరుగా ఎండలో ఎక్కువసేపు ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. వడగాలుల ప్రభావం దృష్ట్యా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, వార్డు స్థాయిలో తాగునీటి సరఫరా, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# కాశీ విశ్వేశ్వర స్వామికి నాగాభరణం బహూకరణ

**సత్తి సత్యనారాయణ కుటుంబ సభ్యులచే వితరణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కర ఘాట్‌లో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సత్తి వెంకట సాయి సందీప్ తన తండ్రి సత్తి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులందరితో కలిసి 60 గ్రాముల వెండితో తయారు చేయించిన నాగేంద్రుడి కవచాభరణాన్ని బహూకరించారు. నాగేంద్రుడికి వెండి కవచాన్ని అలంకరించిన అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆ కాశీ విశ్వేశ్వర స్వామి, నాగేంద్రుడి ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని కోరి ప్రార్థించారు. కార్యక్రమంలో మేనమామ యర్రంశెట్టి రామారావు (జ్యూడీషియల్ డిపార్ట్‌మెంట్), అత్త లక్ష్మి, కుటుంబ సభ్యులు సత్తి మంగతాయారు, సత్తి వెంకట సాయి సందీప్, నిరీష, సత్తి హర్షిత్, శివ వెంకట సుహాస్, స్నేహితుడు పెనుమత్స రామరాజు, ఆలయ ప్రధాన అర్చకుడు అంజి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సత్తి నిరీషా చేతుల మీదుగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

### గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సీతానగరం మండలంలోని

# ఘాట్‌లను పరిశీలించిన జిల్లా ఎస్పీ, కలెక్టర్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఐఏఎస్‌తో కలిసి సీతానగరం మండలంలోని మునికూడలి, ముగ్గళ్ళ ఘాట్‌లను పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా భారీగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని, పుష్కర్ నగర్‌లు, బస్ బేలు, వాహన పార్కింగ్ స్థలాలు, భక్తుల రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు.అలాగే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన తాగునీరు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, విశ్రాంతి కేంద్రాలు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలు వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలో భాగంగా సంబంధిత శాఖల అధికారులతో ఏ రకముగా నిర్వహించాలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో 2002 పదో తరగతి నలంద ట్యూషన్ బ్యాచ్ వారు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు జనార్ధన్, కనకదుర్గలను చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారందరూ ఒకే చోట కలిసి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉపాధ్యాయులతో కలిసి ఆటపాటలతో గడిపారు. తదనంతరం ఉపాధ్యాయుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, లక్ష్మీనారాయణ, శ్రీను రమేష్, కిరణ్, మల్లేశ్వరి, విశాలాక్షి, సాదిక, సుబ్బలక్ష్మి, రాజేశ్వరి, దేవి, వీరవేణి, జ్యోతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గురు విద్యా వాచస్పతి పురస్కారాన్ని అందుకున్న కృష్ణ మోహన్



**జమ్మలమడుగు, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఎన్ఎస్‌బి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణ మోహన్"శ్రీగురు విద్యా వాచస్పతి పురస్కారాన్ని అందుకున్నారు.అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం, ఆంధ్ర ప్రదేశ్ విభాగం వారు బుధవారం ఉదయం జమ్మలమడుగు శ్రీ రంగనాధ స్వామి కల్యాణ మంటపంలో జరిగిన ఒక కార్యక్రమం లో కృష్ణ మోహన్‌కు ఈ పురస్కారాన్ని అందచేశారు. వినూత్న విద్యా బోధన, సామాజిక సేవా కార్యక్రమాల్లో వారి పాత్ర, మున్నగు అంశాలను పరిగణన లోకి తీసుకుని వారిని శ్రీ గురు పురస్కారానికి ఎంపిక చేశామని నిర్వాహకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా తిరుమల తిరుపతి దేవస్థానసిద్ధాంతి దైవజ్ఞబ్రహ్మశ్రీ తంగిరాల కృష్ణ ప్రసాద్ శర్మ పాల్గొని, కృష్ణ మోహన్ కు ఈ అవార్డు, బిరుదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రగంటి ప్రసాద్ శర్మ,అసుండి హనుమాన్ శాస్త్రి,తిరుపతి సంస్కృతి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ కృష్ణ మూర్తి రాష్ట్రపతి పురస్కారగ్రహీతరంగాచార్యులు పాల్గొన్నారు.


# ప్రతి ఇల్లు నమోదు కావాలి - ఎవ్వరూ మిగిలిపోకూడదు

**గృహగణనపై కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గృహగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇప్పటివరకు మీ ఇంటికి రాకపోయినా, మీ ఇల్లు ఇంకా నమోదు కాకపోయినా ఆందోళన చెందవలసిన అవసరం లేదని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. కంట్రోల్ రూమ్ 9494060060 నెంబర్ కు ఫోన్ చేయడం లేదా వాట్సప్ ద్వారా మీ వివరాలు తెలియపరచి గృహగణనను పూర్తి చేసుకోవచ్చునని నగర ప్రజలకు సూచించారు. కనుక దేశాభివృద్ధికి కీలకమైన జనాభా లెక్కల సేకరణలో ప్రజలు భాగస్వాములు కావాలని.. ఇంటింటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. అలాగే స్వీయగణన(సెల్ఫ్ ఎన్యుమరేషన్) సమయంలో ఏమైనా తప్పులు నమోదు అయినట్లయితే.. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి ఎన్యుమరేషన్ సమయంలో వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. తాళం వేసిన ఇళ్లు, అందుబాటులో లేని స్థానికుల సమాచారం విషయంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రికార్డుల నమోదులో ఖచ్చితత్వం పాటించాలని, ఏ ఒక్క ఇంటిని వదలకుండా ప్రతి గడపకూ వెళ్లాలని స్పష్టం చేశారు.






# ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరో ఎవరో తెలుసా?

ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న సినిమా 'డ్రాగన్'. తారక్ పుట్టిన రోజు సందర్భంగా నిన్న రాత్రి ఈ మూవీ గ్లింప్స్ రిలీజ్ చేశారు. సుమారు 4 నిమిషాలకు పైగా నిడివితో ఉన్న ఈ గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా నిన్న మేకర్స్ విడుదల చేసిన 'డ్రాగన్' మూవీ గ్లింప్స్ వీడియో కి సోషల్ మీడియా లో సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. సుమారు 4 నిమిషాలకు పైగా రన్ టైమ్ తో ఉన్న ఈ గ్లింప్స్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో ఎన్టీఆర్ ఇంట్రడక్షన్ సీన్, చెప్పిన డైలాగులు అభిమానులకు పూనకాలు తెప్పించాయని చెప్పవచ్చు. ఈ గ్లింప్స్ తోనే దాదాపు డ్రాగన్ మూవీ స్టోరీ చెప్పేశారు ప్రశాంత్ నీల్. ఒపియమ్ అనే మొక్క, దీని ద్వారా వచ్చే హెరాయిన్.. దీని చుట్టూ ఉండే మాఫియా బ్యాక్ డ్రాప్ నేపథ్యంలో ఈ సినిమా సాగనుందని తెలుస్తోంది. దీనికి తోడు ఇందులో ఏకంగా ఎనిమిది విలన్స్ కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, హాలీవుడ్ కు చెందిన పలువురు స్టార్స్ డ్రాగన్ లో నటించనున్నారు. అశుతోష్ రాణా, అనిల్ కపూర్, బిజు మేనన్, అన్షుమాన్ పుష్కర్, సిద్ధాంత్ గుప్తా, గురు సోమసుందరం, బిమల్ జీత్ ఒబెరాయ్, రష్యన్ నటుడు అలెగ్జాండర్ విజేవ్, బ్రిటిష్ నటుడు బెన్డిక్ట్ గారెట్, సౌతాఫ్రికా యాక్టర్ తుతేలో ప్రిన్స్ గ్రాట్ బూమ్ ఇలా దేశ, విదేశాలకు చెందిన నటీనటులు ఈ మూవీలో యాక్ట్ చేస్తున్నారు. ఇక డ్రాగన్ మూవీలో కాంతారా బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా నటిస్తోంది. అయితే ఈ సినిమాలో మన తెలుగు వారందరికీ బాగా పరిచయమైన మలయాళం స్టార్ హీరో టొవినో థామస్ కూడా నటించాల్సి ఉంది. అయితే డేట్స్ అడ్జెస్ట్ చేయలేక ఈ సినిమాను వదులుకున్నాడు. కొన్ని రోజుల క్రితం టొవినే థామసే స్వయంగా ఈ విషయాన్ని బయట పెట్టాడు. 'సాధారణంగా మలయాళ సినిమాలు ఒకే షెడ్యూల్‌లో లేదా మూడు నెలల్లో పూర్తి అవుతాయి. కానీ తెలుగులో భారీ ప్రాజెక్టుల కోసం ఏడాది పొడవునా వేర్వేరు సమయాల్లో డేట్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అది కూడా ఆయా షెడ్యూల్స్ బట్టి. అది నాకు కష్టం అవుతోంది. నాకు ఓ సినిమా పూర్తి అయ్యాక మరో సినిమా చేయడం అలవాటు. ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ సినిమాలు చేయడం ఇష్టం లేదు. ఒక సినిమా కోసమే ఏడాది పాటు సమయం కేటాయిస్తే... నా మలయాళ సినిమాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అక్కడ నా కమిట్‌మెంట్లను బ్రేక్ చేయడం ఇష్టం లేక ఎన్టీఆర్ – నీల్ సినిమా డ్రాగన్ ను వదులుకున్నా' అని టొవినో చెప్పుకొచ్చాడు. కాగా డ్రాగన్ సినిమాలో ఆఫ్ఘాన్ ట్రేడింగ్ కంపెనీలో వాజిర్ అయిన బాబీ సర్కార్ పాత్రకు టోవినే థామస్ ను అడిగారని టాక్. అయితే అతను ఇంట్రెస్ట్ చూపించకపోవడంతో బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ గుప్తాను ఈ పాత్రకు తీసుకున్నారని సమాచారం. డ్రాగన్ సినిమాలో బాబీ సర్కార్, లూగెర్ (ఎన్టీఆర్) అన్నదమ్ములుగా కనిపించనున్నారని సమాచారం.

అతనిని బాగా నమ్మి మోసపోయా.. మూడేళ్లపాటు నరకం చూశా..

# బ్రేకప్ స్టోరీ చెప్పిన అనన్య నాగళ్ల



టాలీవుడ్‌లో హీరోయిన్‌గా రాణిస్తున్న తెలుగు అమ్మాయిల్లో అనన్య నాగళ్ల ఒకరు. ఖమ్మం జిల్లాకు చెందిన ఈ ముద్దుగుమ్మ వరుసగా సినిమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చు కుంటోంది. ఆ మధ్యన ఇన్ స్టా గ్రామ్ సబ్ స్క్రిప్షన్ తో వార్తల్లో నిలిచన అనన్యకు ఓ బ్రేకప్ స్టోరీ కూడా ఉందట. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన అనన్య నాగళ్ల సినిమాల్లోక రాక ముందు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కొన్నాళ్లు వర్క్ చేసింది. అయితే నటనపై ఆసక్తితో మొదట షార్ట్ ఫిల్మ్స్ చేసింది. ఆ తర్వాత సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. మల్లేశం సినిమాతో వెండితెరకు పరిచయమైన అనన్య నాగళ్ల అతి కొద్ది కాలంలోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్లే బ్యాక్, వకీల్ సాబ్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతలం, మళ్లీపెళ్లి, అన్వేషి, తంత్ర, డార్లింగ్, పొట్టేల్, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ తదితర సినిమాలలో అనన్య నటించింది. ఓవైపు హీరోయిన్ గా మెప్పిస్తూనే మరోవైపు సహాయక నటిగానూ ఆకట్టుకుందీ అందాల తార. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంటోన్న అనన్య రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూకు హాజరైంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ విషయాలను అందులో షేర్ చేసుకుంది. ఇదే సందర్భంగా తన బ్రేకప్ స్టోరీని కూడా చెప్పి బాధపడింది. ఇటీవలి కాలంలో దేని గురించైనా ఏడ్చావా? ఎందుకు ఏడ్చావని అని యాంకర్ ప్రశ్నించగా అనన్య ఇలా సమాధానమిచ్చింది. ' చాలా ఏళ్ల తర్వాత బాగా ఏడ్చాను. అది కూడా ఒక వ్యక్తి వల్ల. ఇది లవ్ బ్రేకప్, లవ్ ఫెయిల్యూర్ అని నేను చెప్పను. కానీ ఒక వ్యక్తిని బాగా నమ్మాను. కానీ మోసపోయాను. ఉదయాన్నే నిద్రలేవగానే ఆ ఆలోచనలే వెంటాడతాయి. ఎంత బిజీగానే ఉన్నా అవే గుర్తొస్తూనే ఉంటాయి. బ్రేకప్ తాలూకా బాధను మూడేళ్లపాటు అనుభవించా. అయితే షూటింగ్స్‌కి మాత్రం అస్సలు మిస్ అయ్యే దానిని కాదు. రాత్రంతా ఏడ్చినా తెల్లవారగానే జిమ్‌కి వెళ్లిపోయేదాన్ని. షూటింగ్‌లో కేరవాన్‌లోనే కూర్చొని నా షాట్ వచ్చే వరకు వెక్కి వెక్కి ఏడ్చేదానిని. తర్వాత కళ్లు తుడుచుకుని నా పని చూసుకునేదానిని. నాకు తెలిసి చాలా మంది అమ్మాయిలకు ఇవే ప్రాబ్లమ్స్ ఉంటాయి. అమ్మాయిలు చాలా సెన్సిటివ్. అమ్మాయిలు వదిలేసి వెళ్లిపోతారని చాలా మీమ్స్ సోషల్ మీడియాలో వస్తుంటాయి. ఎన్నో మాటలు అంటారు. అబ్బాయిలు ఎక్కువగా ఉండటం, కంటెంట్ క్రియేటర్స్ కూడా వాళ్లే ఉండటం వల్ల వాళ్ల పాయింట్ ఆఫ్ వ్యూ బయటకు వస్తుంది. మన పాయింట్ ఆఫ్ వ్యూ బయటకు రావడం లేదు' అని అనన్య ఎమోషనలైంది. ప్రస్తుతం ఈ తెలుగమ్మాయి కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

# ప్రయోగాలంటూ ఆ నలుగురికి షాకిచ్చిన బీసీసీఐ..

మరి ఆ ఇద్దరి ఎంపికలో అసలు మతలబు ఏంటి?



ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టు ఎంపిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అద్భుతమైన ఫామ్‌లో ఉండి, జట్టులో స్థానానికి అన్ని విధాలా అర్హులైన నలుగురు స్టార్ ఆటగాళ్లను సెలెక్టర్లు పూర్తిగా పక్కనబెట్టారు. దీంతో బీసీసీఐ సెలెక్షన్ కమిటీ నిర్ణయాలపై అభిమానులు, విశ్లేషకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌తో స్వదేశంలో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం రాత్రి జట్టును ప్రకటించింది. యువ సంచలనం శుభ్‌మన్ గిల్ సారథ్యంలో, శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా సరికొత్త వ్యూహాలతో బరిలోకి దిగుతున్న ఈ జట్టు ఎంపిక ఇప్పుడు పెద్ద వివాదానికి దారితీసింది. 2027 వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా కొత్త ప్రయోగాలకు తెరలేపామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ చెబుతున్నప్పటికీ, కొందరు ఆటగాళ్ల పట్ల అనుసరించిన వైఖరి చూస్తుంటే సెలెక్షన్ కమిటీలో అంతర్గత రాజకీయం నడుస్తోందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఫామ్‌లో ఉన్న సీనియర్లను, దేశీవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న ఆటగాళ్లను కాదని కొందరిని పక్కనబెట్టడం క్రికెట్ వర్గాల్లో కలకలం రేపుతోంది. ముఖ్యంగా భారత జట్టులో చోటు దక్కించుకోవడానికి వంద శాతం అర్హత ఉన్న ఆ నలుగురు క్రికెటర్ల పరిస్థితి ఇప్పుడు అభిమానులను సైతం కలచివేస్తోంది.

**అక్షర్ పటేల్‌పై వేటు.. కొత్త ప్రయోగాల వెనుక ఆంతర్యమేమిటి..?**

భారత జట్టు నమ్మకమైన ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను ఈ సిరీస్ నుంచి అకస్మాత్తుగా తప్పించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అతని స్థానంలో విదర్భ తరపున దేశీవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న హర్ష్ దూబేకు సెలెక్టర్లు అవకాశం కల్పించారు. హర్ష్ దూబే ఇప్పటివరకు 30 లిస్ట్-ఏ మ్యాచ్‌లలో 31 వికెట్లు తీసి, బ్యాటింగ్‌లో రెండు అర్ధసెంచరీలతో 296 పరుగులు చేశాడు. అతని రికార్డు బాగానే ఉన్నప్పటికీ, అనుభవజ్ఞుడైన అక్షర్‌ను తప్పించాల్సిన అవసరం ఏమొచ్చిందనేది మింగుడుపడటం లేదు. రాబోయే ప్రపంచకప్ కోసం ప్రత్యామ్నాయాలను పరిశీలించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అగార్కర్ సమర్థించుకుంటున్నా, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న అక్షర్‌ను ఇలా పక్కనబెట్టడం చర్చనీయాంశంగా మారింది.

**మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిపై మళ్లీ నిర్లక్ష్యం..**

ఇటీవలి కాలంలో అద్భుతమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను వణికించిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి సైతం ఈ వన్డే జట్టులో చోటు దక్కలేదు. భారత్ తరపున ఆడిన గత 4 ఇన్నింగ్స్‌ల్లోనే 10 వికెట్లు పడగొట్టి సత్తా చాటిన ఈ స్పిన్నర్‌ను గాయాలు, ఫామ్ నెపంతో దూరం పెట్టారు. ప్రస్తుతం జరుగుతున్న లీగ్ మ్యాచ్‌ల్లోనూ వరుణ్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నప్పటికీ, సెలెక్టర్లు అతని ప్రతిభను గుర్తించకపోవడం వెనుక బలమైన శక్తులు పనిచేశాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

**పర్పుల్ క్యాప్ వీరుడు భువనేశ్వర్ కుమార్‌కు ఘోర అన్యాయం..**

ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో సంచలన బౌలింగ్‌తో పర్పుల్ క్యాప్‌ను తనవద్దే ఉంచుకున్న సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు మరోసారి మొండిచేయి ఎదురైంది. ఈ సీజన్‌లో 13 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 24 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా దూసుకుపోతున్న భువీని పరిమిత ఓవర్ల క్రికెట్‌లోకి తిరిగి తీసుకుంటారని అందరూ భావించారు. స్వింగ్ బౌలింగ్‌తో పవర్‌ప్లేలో వికెట్లు తీయగల సమర్థుడైన భువనేశ్వర్‌ను వైట్ బాల్ క్రికెట్ నుంచి పూర్తిగా దూరం పెట్టాలనే సెలెక్టర్ల మొండి వైఖరి నెటిజన్ల ఆగ్రహానికి కారణమవుతోంది.

# ఐపీఎల్ కోసం స్వదేశాన్ని ఛీకొట్టిన పాక్ ప్లేయర్..

వేలంలో ఎంట్రీకి లైన్ క్లియర్.. కట్‌చేస్తే




భారత క్రికెట్ అభిమానులకు అత్యంత సంచలనమైన వార్త. పాకిస్థాన్ సీనియర్ ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ అమీర్ ప్రపంచంలోనే అత్యంత సంపన్న లీగ్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడేందుకు అధికారికంగా అర్హత సాధించాడు. ఇప్పటివరకు ఐపీఎల్ వైపు కన్నెత్తి కూడా చూడని ఈ పాక్ బౌలర్‌కు సరిహద్దులు దాటి వచ్చేందుకు మార్గం సుగమమైంది. భారతదేశంలో నిర్వహించే ఐపీఎల్‌లో పాకిస్థాన్ ఆటగాళ్లపై దశాబ్దాలుగా నిషేధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే, మొహమ్మద్ అమీర్ తాజాగా బ్రిటీష్ పాస్‌పోర్ట్ సాధించి, అధికారికంగా బ్రిటన్ పౌరసత్వాన్ని పొందాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం పాకిస్థాన్ పాస్‌పోర్ట్ కలిగిన ఆటగాళ్లపై మాత్రమే నిషేధం ఉంది కానీ, పాక్‌లో జన్మించిన వారిపై కాదు. అమీర్ ఇప్పుడు బ్రిటీష్ పౌరుడిగా ఐపీఎల్ వేలంలో తన పేరును నమోదు చేసుకోవడానికి చట్టపరంగా పూర్తి అర్హత సాధించాడు. గతంలో పాక్ మాజీ ఆల్‌రౌండర్ అజహర్ మహమూద్ కూడా ఇదే విధంగా బ్రిటన్ పౌరసత్వంతో కింగ్స్ ఎలెవన్ పంజాబ్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

**నిషేధాలు, వివాదాల సుదీర్ఘ ప్రయాణం..**

2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత భారత ప్రభుత్వం, బీసీసీఐ కలిసి పాక్ ఆటగాళ్లను ఐపీఎల్‌కు దూరం పెట్టాయి. దీనికి తోడు 2010లో ఇంగ్లాండ్ పర్యటనలో మొహమ్మద్ అమీర్ స్పాట్ ఫిక్సింగ్ వివాదంలో చిక్కుకుని ఐదేళ్లపాటు అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిషేధానికి గురయ్యాడు. ఆ తర్వాత పునరాగమనం చేసి పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో రాణించినప్పటికీ, పాక్ పాస్‌పోర్ట్ కారణంగా అతడికి భారత్‌లో అడుగుపెట్టే అవకాశం దక్కలేదు. ప్రస్తుతం ఐసీసీ విధించిన పాత నిషేధాలన్నీ ముగిసిపోవడం, చేతిలో బ్రిటీష్ పాస్‌పోర్ట్ ఉండటంతో చట్టపరమైన అడ్డంకులన్నీ తొలిగిపోయాయి.

**2027 వేలంలోకి అమీర్.. ఫ్రాంచైజీలు కొనుగోలు చేస్తాయా..?**

బ్రిటన్ కోటాలో మొహమ్మద్ అమీర్ రాబోయే 2027 ఐపీఎల్ వేలంలో తన పేరును నమోదు చేసుకునే అవకాశం ఉంది. ట్వంటీ-20 క్రికెట్‌లో అతడికి ఉన్న అద్భుతమైన రికార్డు, అనుభవం దృష్ట్యా ఏ జట్టుకైనా అతడు కీలక బౌలర్‌గా మారగలడు. అయితే, చట్టపరంగా అర్హత సాధించినప్పటికీ, వేలంలో ఏ ఫ్రాంచైజీ అయినా అతడి కోసం బిడ్ వేస్తుందా లేదా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

**అసలు ట్విస్ట్: బీసీసీఐ, ప్రభుత్వాల నిర్ణయం ఏంటి..?**

కాగితాల పరంగా, నిబంధనల పరంగా అమీర్‌కు లైన్ క్లియర్ అయినప్పటికీ, అతడు ఐపీఎల్ మైదానంలో అడుగుపెట్టడం అంత సులువు కాదు. ఎందుకంటే ఐపీఎల్ కేవలం ఒక క్రీడా టోర్నమెంట్ మాత్రమే కాదు, దీని వెనుక కోట్ల మంది భారతీయుల సెంటిమెంట్ దాగి ఉంది. ముఖ్యంగా ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో దేశంలో పాక్ పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాభిప్రాయాన్ని, దేశ భద్రతను గౌరవించే బీసీసీఐ, కేంద్ర ప్రభుత్వం.. పాక్ మూలాలున్న ఆటగాడిని లీగ్‌లోకి అనుమతించే విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తాయి. మొహమ్మద్ అమీర్ బ్రిటన్ పౌరసత్వం పొందడం ద్వారా ఐపీఎల్ తలుపులు తట్టినట్లయింది. కానీ, భారత్-పాక్ మధ్య ఉన్న రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతలు, కార్పొరేట్ ఫ్రాంచైజీల భయాల మధ్య అమీర్ ఐపీఎల్ కల నెరవేరుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. కేవలం నిబంధనలు మారినంత మాత్రాన, మైదానంలో పరిస్థితులు మారవని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com